Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక




సంపుటి : 26 | సంచిక : 271 | హైదరాబాద్ | శనివారం 15 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



# రేవంత్ ఒంటరి పోరు!

## ఆయన కుటుంబమే టార్గెట్

- విమర్శలు ఎక్కుపెట్టిన బీఆర్ఎస్
- నోరెత్తని మంత్రులు.. నేతలు
- స్వయంగా స్పందిస్తున్న సీఎం
- కాంగ్రెస్‌లో ఏం జరుగుతుందనే చర్చ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ టార్గెట్ చేసింది. అంతేకాకుండా ప్రభుత్వంపై కూడా అదే స్థాయిలో విమర్శల వర్షం కురిపిస్తోంది. ఎక్కడ ఏ చిన్న అవకాశం వచ్చినా దానిని భూతద్దంలో పెట్టి చూపిస్తోంది. టెస్సరాక్ట్ భూ కేటాయింపుల వివాదం, మూసీ ప్రక్షాళన వ్యయం, సీఎం రేవంత్ రెడ్డి సోదరుల ప్రమేయం, లగచర్ల ఘటన, హైడ్రా కూల్చివేతలు తదితర అంశాలను ఆసరాగా చేసుకుని రోజుకో అంశంపై అటాక్ చేస్తోంది. చిన్న విషయాలపై కూడా రాద్ధాంతం చేస్తోంది. ప్రభుత్వ యాంటీ సోషల్‌మీడియా సైతం చురుకుగా పని చేస్తుంది.

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

ప్రభుత్వంపై ముఖ్యంగా రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టడంలో కాంగ్రెస్ విఫలమవుతుందనే భావన వ్యక్తమవు తోంది. ఒకరిద్దరు నోరు విపుతున్నా.. బీఆర్ఎస్ నేతలు చేస్తున్న అగ్రెసివ్, మాస్ పొలిటికల్ అటాక్‌ను కౌంటర్ చేయడానికి ఆ వివరణలు సరిపోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమ వుతోంది. పొలిటికల్ ఆరోపణలకు సమా ధానం పొలి టికల్ లాంగ్వేజ్‌లోనే ఉండాలి తప్ప, కేవలం టెక్నికల్ డిఫెన్స్ ఇవ్వడం వల్ల ప్రతిపక్షాలు సృష్టించే నెరేటివ్ జ నాల్లోకి బలంగా వెళ్లే ప్రమాదం ఉందనేది క్యాడర్ భావన.

### మంత్రులు మాట్లాడరేం..

రేవంత్‌పై, ప్రభుత్వంపై విమర్శలు తిప్పికొట్టడంలో ప్రభుత్వం, ముఖ్యంగా మంత్రులు విఫలమవుతున్నారనే విమర్శ ఉంది. ఇటు బీఆర్ఎస్, అటు బీజేపీ రెండు వైపుల నుంచి దాడులు చేస్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కరే స్వయంగా రంగంలోకి దిగాల్సి వస్తుంది తప్ప మంత్రులు మాట్లాడటం లేదు. అలాగని రేవంత్

- మిగతా 2వ పేజీలో



# 'వికసిత్ భారత్' సాధనే లక్ష్యం

## లక్ష్య సాధనలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలి

- క్లిష్ట పరిస్థితుల్లోనూ భారత్ బలమైన ఆర్థిక శక్తిగా నిలిచింది..
- 'ఇండిపెండెన్స్ డే' సందేశంలో రాష్ట్రపతి ద్రౌపది పిలుపు

- 2లో

'వికసిత్ భారత్' సాధ నే భారత ప్రభుత్వ లక్ష్యమని, ఈ లక్ష్య సాధనలో యావత్ దేశ ప్రజలు భాగస్వాములు కావాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. రాజ్యాంగం దేశ ప్రజలకు అందించిన హక్కులు, బాధ్యతలను ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు.



# మీ జోక్యమెందుకు?

## వివాదం నాకు, విద్యార్థులకు మధ్యనే.. 'బీసీఐ'కేం సంబంధం?

- తప్పు చేసినా.. విద్యార్థులకు తమ అభిప్రాయాన్ని ప్రకటించే హక్కు ఉంది
- నల్సార్ లా వర్సిటీ వివాదంపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

- 2లో



# ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు

## కొంతమంది ఎమ్మెల్యేలు ఏదంటే అది మాట్లాడుతున్నారు

- అలా మాట్లాడటం సరైంది కాదు.. ఏదైనా ఉంటే నాతో నేరుగా మాట్లాడండి
- బయట వ్యాఖ్యలు చేసి, మీడియాతో మాట్లాడి నష్టం చేసుకోవద్దు
- పార్టీని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు ఐక్యంగా ప్రయత్నిద్దాం: సీఎం రేవంత్‌రెడ్డి!

- 2లో

మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు.. అందరం కలిసి ఐక్యంగా పనిచేస్తూ ముందుకెళ్దామని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. 'కష్టపడి పార్టీని అధికారంలోకి తెచ్చుకున్నాం. అన్ని రకాలుగా కష్టపడుతూ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నాం. కానీ కొంత మంది ఎమ్మెల్యేలు ఏదంటే అది మాట్లాడుతున్నారు.

# 'బయో ఎనర్జీ'పై కర్ణాటకతో కలిసి పనిచేస్తాం

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్, ఆగస్టు 14 (ప్రజాతీర్పు)

జీవ ఇంధన (బయో ఎనర్జీ) రంగంలో కర్ణాటకతో కలిసి పని చేయడానికి, రాబోయే రోజుల్లో మరింత పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా

- మిగతా 2వ పేజీలో




# ఇన్వెస్ట్ తెలంగాణ

## గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహణకు క్యాబినెట్ ఆమోదం

- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో డిఫెన్స్, ఏరోస్పేస్, ఫార్మా రంగాల్లోని అవకాశాలను చాటి చెప్పాలి
- స్టార్టప్, పరిశ్రమలు సాధించిన విజయాలు, కొత్త ఆవిష్కరణలపై ప్రదర్శనలు
- సదస్సు నిర్వహణకు డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలో క్యాబినెట్ సబ్‌కమిటీ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శుక్రవారం సచివాలయంలో దాదాపు 3 గంటల పాటు జరిగిన క్యాబినెట్ భేటీలో పలు అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు. గత ఏడాది తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించినట్లే.. ఈసారి కూడా ఫ్యూచర్ సిటీలో ఇన్వెస్ట్ తెలంగాణ థీమ్‌తో సదస్సు నిర్వహణకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.



హైదరాబాద్, ఆగస్టు 14 (ప్రజాతీర్పు)

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహణకు రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో సదస్సు నిర్వహించాలని ప్రాథమికంగా తేదీలను నిర్ణయించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి అధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్లాన్ ఆవిష్కరిం చనుంది. ప్రధానంగా రాష్ట్రంలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మా రంగాల్లో పరి శ్రమలు, పెట్టుబడులకు

- మిగతా 2వ పేజీలో

# ఇన్వెస్ట్ తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)



ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈసారి సదస్సు జరుగుతుంది. వివిధ రంగాల్లో ఇప్పటికే తెలంగాణ స్టార్టప్‌లు, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ రఘురామిరెడ్డితో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వివవరించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించిందని, అందుకు సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గతంలో రాష్ట్రంలో 2.81 కోట్ల మంది రేషన్ కార్డు లబ్ధిదారులుంటే.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డులు జారీ చేయడంతో 62 లక్షల మందికి కొత్తగా లబ్ధి చేకూర్చిందని తెలిపారు. రాష్ట్రంలో ఈ రోజుకు మొత్తం 3.42 కోట్ల మంది రేషన్ లబ్ధిదారులున్నారు. వీరికి స్మార్ట్ కార్డుల జారీకి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, ఆ ఏడు రకాల సాగును పెంచడానికి రైతులకు అవగాహన కల్పించాలని కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది నుంచి ఈ ఏడు రకాల సన్నాలకే రూ.500 బోనస్ చెల్లించాలని కేబినేట్ తీర్మానించింది. ప్రభుత్వం లేదా ప్రయివేట్ వ్యక్తుల ద్వారా ఏడు రకాల సన్నవరి విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు వ్యవసాయ అధికారుల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా రైతుల్లో అవగాన, చైతన్యం కల్పించే విధంగా అధికారులు ఆదేశించాలని నిర్ణయం తీసుకున్నారు.

యాసంగి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిచింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి 81.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులకు కనీస మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేసింది. అందులో 63.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కేంద్ర ప్రభుత్వం సేకరిస్తుంది. మిగతా 17.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ వేలం ద్వారా విక్రయించేందుకు కేబినేట్ ఆమోదం తెలిపింది. ఇటీవల మొక్కజొన్న వేలంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం రాబట్టుకున్న నేపథ్యంలో ఈ మిగులు ధాన్యానికి కూడా క్వింటాలుకు రూ.2389 బేసిక్ ప్రైస్ నిర్ణయించి.. ఈ వేలం ద్వారా ధాన్యం అమ్మాలని కేబినేట్ నిర్ణయించింది.

రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (వైఐఎస్‌యూ) పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం పరిశ్రమల శాఖ పరిధిలో ఉన్న వీటన్నింటినీ ఇకపై శక్తి శాఖ పరిధిలోకి విలీనం చేసేందుకు క్యాబినెట్ తీర్మానించింది.

ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో తొలివిడతగా 113 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్ కాంప్లెక్స్‌ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈరోజు కొత్తగా ఆమోదించిన 7 స్కూళ్లతో కలిపి ఇప్పటివరకు 86 యంగ్ ఇండియా రెసిడెన్సియల్ స్కూల్ కాంప్లెక్స్ లకు అనుమతులు మంజూరయ్యాయి.

మిగిలిన నియోజకవర్గాల్లోనూ వీలైనంత తొందరగా స్థల సేకరణ చేసి, నిర్మాణాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ స్కూళ్లను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నిర్మాణాలు పూర్తయిన చోట వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది.

మక్తల్- ఎత్తిపోతల ఫేజ్- పనుల కోసం రూ. 2,100 కోట్ల అంచనా వ్యయానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో దాదాపు లక్ష ఎకరాలకు సాగు నీరు, ఆ ప్రాంతంలో తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు ఈ ఎత్తిపోతల నుంచి అందుతుంది. గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీ నుంచి 15 టీఎంసీలకు పెంచటంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్‌ను నియామకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

**ఈవీలుగా ఆటోలు..**

**రూ. 200 కోట్లతో ప్రత్యేక పథకం..**

కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించి.. హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చేందుకు రాష్ట్రమంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసు కుంది. హైదరాబాద్‌లో ప్రస్తుతం 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోరిక్షాలున్నాయి. వీటిని ఈవీ (విద్యుత్తు వాహనాలుగా) మార్చేందుకు రూ.200 కోట్లతో ప్రత్యేక పథకం (తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్) అమలుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలి పింది. అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1.50 లక్షలు సబ్సిడీ అందిస్తారు. ఈ పథకం కింద, ఆటోకు విద్యుత్ కిట్ అమర్చుకోవటం లేదా పాత వాహనాన్ని స్క్రాప్ చేసి కొత్త విద్యుత్ ఆటో కొనుగోలు చేసుకోవచ్చు.

## 'వికసిత్ భారత్' సాధనే లక్ష్యం

న్యూఢిల్లీ, ఆగస్టు 14 (ప్రజాతీర్పు)

క్లిష్ట పరిస్థితుల్లోనూ భారత్ బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని కొనియాడారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి ఆమె జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. దేశ ప్రగతికి యువతే ఆధారమని, దేశ భవిష్యత్తుకు విద్యార్థులే నిజమైన రూపశిల్పులని అభివర్ణించారు. యువత భవిష్యత్తును కాపాడేందుకు భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. పరీక్షా పత్రాల లీకేజీని అరికట్టేందుకు కేంద్రప్రభుత్వం కఠినమైన సంస్కరణలను చేపట్టిందని తెలిపారు. పరీక్షా విధానాన్ని మరింత పారదర్శకంగా మారుస్తోందని వివరించారు. పోటీ పరీక్షల వ్యవస్థను పారదర్శకంగా మారుస్తున్నదని పేర్కొన్నారు. సంస్కరణలతో యువతకు విద్యావ్యవస్థపై విశ్వాసం పెరుగుతుందని ఆకాంక్షిం చారు. ఉగ్రవాదులు, వారి మద్దతుదారులు ఎక్కడ దాక్కున్నా, వారిని వదిలిపెట్టేది లేదని, వారు పర్యావసానాలు ఎదుర్కొనక తప్పదని 'ఆపరేషన్ సిందూర్'ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. పాక్‌భా భారత్ మధ్య సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం దేశ ప్రయోజ నాలను, ముఖ్యంగా రైతులను దృష్టిలో ఉంచుకొని తీసుకున్న నిర్ణయాత్మక చర్య అని అభివర్ణించారు. 'జన గణ మన'కు సమానంగా భారత ప్రభుత్వం వందేమాతరం గీతానికి చట్టబద్ధత కల్పించిందని కొనియాడారు. వందేమాతర గీతం స్వతంత్ర పోరాటంలో కీలక పాత్ర పోషించిందని కీర్తించారు. ఎవరైనా గీతాన్ని ఆలపించకుండా అడ్డుకోవడం లేదా భం గం కలిగించడం శిక్షార్హమైన నేరమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతిఒ క్కరూ దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరిం చుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రపతి ప్రసంగంలో ఈ సారి ఒక కీలక మార్పు చోటు చేసుకుంది. ప్రసంగానికి ముందు ఆమె 'వందేమాతరం' గీతం ఆరు చరణాల పూర్తి పాఠాన్ని ఆలపించారు. ప్రసంగం ముగిసిన తర్వాత జాతీయ గేయం 'జన గణ మన' సైతం ఆల పించారు. స్వాతంత్ర్య దినోత్సవ సందేశం వందేమాతరంతో ప్రారంభం కావడం ఇదే తొలిసారి.

## 'బయో ఎనర్జీ'పై కర్ణాటకతో కలిసి పనిచేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. కర్ణాటక రాష్ట్ర బయో ఎనర్జీ అభివృద్ధి మండలి ఛైర్మన్ సుధీంద్ర శంషాబాద్ విమానాశ్రయంలో భట్టి విక్రమార్కను కలిశారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల్లో బయో ఫ్యూయల్ రంగ అభివృద్ధిపై ఇరువురు నేతలు చర్చించారు. కర్ణాటకలో బయో ఫ్యూయల్‌కు సంబంధించిన కార్యక్రమాల పురోగతిని సుధీంద్ర భట్టి విక్రమార్కకు వివరించారు. కంప్రెస్డ్ బయోగ్యాస్, బయో ఫ్యూయల్స్ అభివృద్ధి కోసం కర్ణాటకలో చేపట్టిన కార్యాచరణ ప్రణాళికలను, ప్రతిపాదిత కొత్త బయోఎనర్జీ విధానాన్ని తెలిపారు. సుధీంద్ర వ్యక్తం చేసిన అభిప్రాయాలకు భట్టి సానుకూలంగా స్పందించారు. ఇలాంటి సహకారం ఇరు రాష్ట్రాల ఇంధన రంగాల అభివృద్ధికి పునాది వేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## జర్నలిస్టు జగదీష్‌ను సన్మానించిన ఏసీపీ రవీందర్ రెడ్డి

నర్సంపేట, టౌన్ ఆగస్టు 14 ప్రజా తీర్పు



నిజాయితీ, మానవతా దృక్పథంతో వ్యవహరించి రోడ్డుపై లభించిన బ్యాంకు చెక్కును బాధిత కుటుంబానికి అప్పగించిన జర్నలిస్టు మహాదేవుని జగదీష్‌ను నర్సంపేట ఏసీపీ పి. రవీందర్ రెడ్డి అభినందించి సన్మానించారు.వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో జూలై 19వ తేదీన లక్ష రూపాయల విలువైన చెక్కు రోడ్డుపై లభించగా, దానిని తన వద్ద ఉంచుకోకుండా సంబంధిత వ్యక్తులను గుర్తించి స్వామి కుటుంబ సభ్యులకు అందజేసిన నర్సంపేట డివిజన్ 99 టీవీ జర్నలిస్టు మహాదేవుని జగదీష్ నిజాయితీని ఏసీపీ అభినందించారు. ఈ సందర్భంగా ఏసీపీ కార్యాలయంలో జగదీష్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రజలకు సేవ చేయడంలో జర్నలిస్టులు చూపుతున్న బాధ్యతాయుత వైఖరి అభినందనీయమని ఏసీపీ రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. రోడ్డుపై దొరికిన విలువైన వస్తువులు, నగదు లేదా పత్రాలను సంబంధిత వ్యక్తులకు తిరిగి అందించడం ద్వారా సమాజంలో నమ్మకం, బాధ్యతాయుత పౌరస్ఫూర్తి పెంపొందుతుందని అన్నారు.జగదీష్ చూపిన నిజాయితీ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని, ప్రతి ఒక్కరూ ఇలాంటి సామాజిక బాధ్యతను పాటించాలని ఏసీపీ సూచించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ తనకు దొరికిన చెక్కును అసలు యజమానికి అందించడం తన బాధ్యతగా భావించానని తెలిపారు.నిజాయితీకి గుర్తింపుగా ఏసీపీ చేతుల మీదుగా సన్మానం పొందడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులోనూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు సమాజహిత కార్యక్రమాల్లో తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తానని జగదీష్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, జర్నలిస్టులు తదితరులు పాల్గొని జగదీష్‌ను అభినందించారు.

# మీ జోక్యమెందుకు?



న్యూఢిల్లీ, ఆగస్టు 14 (ప్రజాతీర్పు)

హైదరాబాద్ నల్సార్ లా వర్సిటీ వివాదంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) జోక్యం అనవసరమని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ సీరియస్ అయ్యారు. విద్యార్థులే తప్పు చేసి నా, తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే లా నిరసన తెలిపే భావప్రకటనా హక్కు వాళ్లకు ఉందని స్పష్టం చేశారు. ఈ అంశంలో బీసీఐ జోక్యం చేసుకోవడం పూర్తిగా అనవసరమని వ్యాఖ్యానించారు. జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలతోపాటు విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జి పిటిషన్‌పై విచారణలో సీజేఐ వైఖరి సరిగా లేదని, స్నాతకోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా అంగీకరిం చలేమని, సీజేఐ చేతుల మీదుగా పట్టా అందుకోవడం తమకు ఇష్టం లేదని వర్సిటీ విద్యార్థులు ఇటీవల యాజమా న్యానికి లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై తాజాగా బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) స్పందించింది. వర్సిటీకి చెందిన 2026 బ్యాచ్ న్యాయ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను నిలిపివేయాలని రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు తాజాగా సర్క్యులర్ జారీ చేసింది. 'ఈ నిరసన ప్రచారాన్ని ఎవరు ప్రారంభించారు? నిర్వహించారు? లేదా సమీకరించారు? అనేదానిపై వైస్ ఛాన్సలర్ (వీసీ) నుంచి వాస్తవ నివేదికను సమర్పించాలి' అని వర్సిటీ యాజమాన్యానికి అందిన ఉత్తర్వుల్లో ఉంది.

ఈ ఆదేశాలపై తీవ్ర విమర్శలు వచ్చాయి. విద్యార్థులందరినీ ఒకే కోణంలో చూడటం సరికాదని, కొందరు లేఖ రాసినందుకు మొత్తం బ్యాచ్‌ను బాధ్యులను చేయడం అన్యాయమనే అభిప్రాయం దేశవ్యాప్తంగా వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో బీసీఐ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. మొత్తంగా ఈ వ్యవహారంపై సుప్రీం కోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై శుక్రవారం సుప్రీం కోర్టు త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది.

విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ నిలిపివేయాలనే ఆదేశాలు ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందో, దానిపై వివరణ ఇవ్వాలని సీజేఐ ఈమేరకు బీసీఐకి నోటీసులు జారీ చేశారు. విద్యార్థులకు, తనకు సంబంధించిన విషయంలో బీసీఐ ఎందుకు తలదూరుస్తున్నదని మందలించారు. విద్యార్థులు, ఫ్యాకల్టీపై యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించారు. తమ అభిప్రాయాలను నిర్భయంగా వెల్లడించడం ప్రజాస్వామ్యం ఇచ్చిన హక్కు అని నొక్కిచెప్పారు. నిరసన వ్యక్తం చేశారనే కారణంతో వారి భవితను ప్రశ్నార్థకం చేసే నిర్ణయాలు తీసుకోవడం సరికాదని బీసీఐకి హితవు పలికారు. తాను విద్యార్థిగా ఉన్నప్పుడూ స్వయంగా విద్యార్థి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నానని గుర్తుచేసుకున్నారు. శాంతియుతంగా తమ గళం వినిపిస్తున్న విద్యార్థులను అందుకు అనుమతించాలని సూచించారు. నల్సార్ విద్యార్దులు కావాలంటే సుప్రీంకోర్టు బార్ కౌన్సిల్‌లోనూ లాయర్లుగా నమోదు చేసుకోవచ్చని సీజేఐ సూచించారు. నల్సార్ వర్సిటీ లా విద్యార్థులపై సీజేపీ ఉద్యమ ప్రభావం ఉందని అభిప్రాయపడ్డారు. అనంతరం ధర్మాసనం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌కేబీఏ) అధ్యక్షుడు, సీనియర్ అడ్వొకేట్ వికాస్‌సింగ్ స్పందిస్తూ.. బీసీఐ తీసుకున్న నిర్ణయం 'ఏకపక్షమని, చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. భావప్రకటన స్వేచ్ఛను ఉపయోగించు కుంటున్న లా విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసేందుకు బీసీ యత్నిస్తున్నదని విమర్శించారు. విశ్వవిద్యాలయాలు స్వేచ్ఛాపూరిత ఆలోచనలకు, చర్చలకు వేదికలుగా ఉండాలని, కేవలం అసమ్మతి తెలిపినంత మాత్రాన విద్యార్థులను న్యాయ వృత్తిలోకి ప్రవేశించకుండా అడ్డుకునేలా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని స్పష్టం చేశారు.

బీసీఐ జారీ చేసిన సర్క్యులర్‌పై చైర్మన్ మానన్ మిశ్రా స్పందించారు. విద్యార్థుల ప్రయోజనాలను, హక్కులను కాపాడటమే తమ లక్ష్యమని తెలిపారు. తొందరపాటులోనే ఒక సర్క్యులర్ జారీ చేశామని, విషయం తమ దృష్టికి వచ్చిన తర్వాత, 40 నిమిషాల్లోనే పొరపాటును సరిదిద్దుకున్నామని తెలిపారు. అభిజిత్ దీప్కే అయినా, సౌరవ్ దాస్ అయినా.. తమ లక్ష్యం విద్యార్థుల హక్కులను కాపాడటమేనని వెల్లడించారు.

**లీగల్ కాక్రోచెస్ ఏకమవుతాయి: సీజేపీ**

బీసీఐ సర్క్యులర్‌పై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే 'ఎక్స్' వేదికగా తీవ్రంగా స్పందించారు. 'దేశంలో న్యాయవాద బొద్దింకలన్నీ (లీగల్ కాక్రోచెస్) ఒక్కటైతే ఏమవుతుందో తెలుసా?' అంటూ ప్రశ్నించారు. విద్యార్థుల నిరసన హక్కుపై కక్షసాధింపు చర్యలకు దిగడం సరికాదని, అందుకు బీసీఐ చైర్మన్ మానవ్ మిశ్రా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



## ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు

హైదరాబాద్, ఆగస్టు 14 (ప్రజాతీర్పు)

అలా మాట్లాడటం సరైంది కాదు. ఇప్పటివరకు జరిగింది చాలు. ఇంకో రెండేళ్లు మాత్రమే సమయముంది. ఈ రెండేళ్లు కష్టపడి పనిచేసి, మళ్లీ అధికారంలోకి వచ్చేలా ఐక్యంగా ప్రయత్నిద్దాం..' అని అన్నారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశం తర్వాత.. 10 నిమిషాల పాటు ఆయన రాజకీయ అంశాలపై మంత్రులతో చర్చించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం..మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గురించి ముఖ్యమంత్రి పరోక్షంగా ప్రస్తావిస్తూ మాట్లాడారు. ఏది మాట్లాడినా తనతో నేరుగా లేదా పార్టీ వేదికలపై మాట్లాడాలే తప్ప బయట మీడియాతో మాట్లాడి నష్టం చేసుకోవద్దని సూచించారు.

**అన్ని స్థాయిల్లో నియంత్రణ ఉండాలి..**

జిల్లాల్లో అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలను జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు సమన్వయం చేసుకోవాలని సూచించినట్లు సమాచారం. వారికున్న సమస్యలను తీర్చడానికి ప్రయత్నించాలని, వారు బహిరంగంగా వ్యాఖ్యలు చేయకుండా చూడాలని చెప్పారు. అంతర్గతంగా చర్చించుకునే అంశాలను యథాలాపంగా బయట ఎక్కడపడితే అక్కడ, ఎవరితోనూ పంచుకోవద్దని, ఎంతవరకు అవసరమో ఆ మేరకు ప్రస్తావించాలే తప్ప.. పార్టీకీ, ప్రభుత్వానికి నష్టం జరిగేలా వ్యవహరించొద్దంటూ సున్నితంగా హెచ్చరించినట్లు సమాచారం. ఎవరైనా ఆచితూచి మాట్లాడకపోతే అంతిమంగా మనందరికీ నష్టం జరుగుతుందని అలా జరగకుండా అన్ని స్థాయిల్లో నియంత్రణ ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డట్టు సమాచారం.

**బీఎల్‌ఓలను పూర్తిగా నమ్మొద్దు..**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గురించి కూడా మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు కలిసి రాష్ట్రంలో ఎస్ఐఆర్ కుట్ర చేస్తున్నాయని, కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలో రాకుండా ఉండాలనే దుగ్ధతో పనిచేస్తున్నాయని, ఈ కుట్రను సమష్టిగా ఎదుర్కోవాలని కోరారు. 'ఎన్నికల సంఘం పక్షాన బీఎల్‌ఓలు ఉంటే.. పార్టీ పక్షా బూత్ లెవల్ ఏజెంట్లు పనిచేస్తున్నారు. ప్రభుత్వం మనదే ఉంది కదా అని బీఎల్‌ఓలను నమ్మవద్దు. మన బీఎల్‌ఏలు ఎవరైనా సరిగా పనిచేయకపోతే వారిని వెంటనే తప్పించండి. చురుగ్గా ఉన్న వారిని నియమించండి. అనామలిస్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుని, ఓటర్లకు అన్ని విధాలా సహకరించి వారి ఓట్లు పోకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉంది. ఇన్‌చార్జి మంత్రులు, పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జులు అందరూ అప్రమత్తంగా ఉండి అర్హులైన వారి ఓట్లు పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇది పార్టీ లైన్..'అని చెప్పినట్టు సమాచారం.

# రేవంత్ ఒంటరి పోరు!

(మొదటి పేజీ తరువాయి)

కేబినెట్‌లో మాటకారులైన మంత్రులు, సీనియర్ నేతలు లేరా అంటే ఉన్నారనే చెప్పాలి. కానీ, వారు ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను, ఆరోపణలను అంతే బలంగా తిప్పి కొట్టడం లేదు. ఇందుకు కారణం పార్టీలో అంతర్గత అంతర్గత విభేదాలు, సమన్వయ లోపం.. సీఎం చూసుకుంటారులే అన్న ధోరణా అన్న చర్చ జరుగుతోంది. పదేళ్ల బీఆర్ఎస్‌ను ఒడించి కాంగ్రెస్ అధికారంలోకి రావడం వెనుక సోషల్‌మీడియా పాత్ర కూడా ఉందని చెప్పవచ్చు. కానీ, ప్రస్తుతం కాంగ్రెస్ అనుకూల సోషల్ మీడియా సైతం ప్రభుత్వంపై, రేవంత్‌పై వస్తున్న ఆరోపణలను, విమర్శలను అంత సమర్థవంతంగా తిప్పికొట్టలేకపోతుందనే అపవాదు ఉంది. ప్రతిపక్షాలు తాము ప్రతి ఆరోపణను ఎక్స్, యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్‌లల విపరీతంగా ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా వింగ్ అత్యంత సమర్థవంతంగా ప్రతికూల వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తుంటే.. కాంగ్రెస్ సోషల్ మీడియా వింగ్ మాత్రం దానికి తగిన స్థాయిలో, అంతే వేగంగా డిఫెన్స్ లేదా కౌంటర్ అటాక్ చేయలేకపోతోంది. సాంకేతిక ఆధారాలతో కౌంటర్ వీడియోలు వదలడంలో కాంగ్రెస్ తీవ్రంగా వెనుకబడిపోయింది.

ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే ప్రభుత్వంపై వచ్చే ప్రతి చిన్న ఆరోపణకూ సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా సమాధానాలు చెప్పాల్సి వస్తుంది. ముఖ్యమంత్రి స్థాయిలో ఆయన చిన్న విషయాలపై స్పందించడం సరైంది కాదన్న భావన వ్యక్తమవుతోంది. విపక్షాల నుంచి వచ్చే ఆరోపణలను, విమర్శలను ద్వితీయ స్థాయి నుంచి కింది స్థాయి వరకు తిప్పికొట్టగలిగితే.. వచ్చే మైలేజ్ వేరే రకంగా ఉంటుంది. కానీ, కాంగ్రెస్‌లో సీఎం ఒక్కరే మాట్లాడటం, మిగిలిన వారంతా ప్రేక్షక పాత్ర పోషించడం వల్ల విపక్షాల దాడి మరింత పదునెక్కుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ అగ్రెసివ్‌గా ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది.

# కరూర్ బాధితులకు ఊరట

### కొలువుల కేటాయింపుపై మద్రాసు హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే

### బాధితులకు అండగా నిలవడం తప్పా..? అంటూ పిటిషనర్‌కు మందలింపు

చెన్నై, ఆగస్టు 14: కరూర్ తొక్కిసలాట బాధితులకు ఉద్యోగాలకు సంబంధించిన కేసులో తమిళనాడు సీఎం విజయ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. నియామకాలు చెల్లవంటూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను శుక్రవారం జస్టిస్ జేపీ పార్థివాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టి స్టే విధించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పిటిషన్ దారులకు నోటీసులు జారీ చేసింది. ఇంటిపెద్ద మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక ఆసరా ఇవ్వొద్దా? అని పిటిషన్ దారులను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. తొక్కిసలాట జరిగి చనిపోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశ్యంతో ఉద్యోగం కల్పించడంపై ప్రశ్నించడం సమంజసమేనా? ప్రశ్నించేందుకు మీరు ఎవరు? అని పిటిషన్ దారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. గతేడాది సెప్టెంబర్‌లో కరూర్ తొక్కిసలాట సందర్భంగా 41 మంది మృతి చెందారు. జూలై 10న అధికారంలోకి వచ్చాక సీఎం విజయ్ అర్హులైన వారికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. దీనిపై మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు కాగా, నియామకాలు చెల్లవని తీర్పునిచ్చింది. దీనిపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

# త్వరలో భారత్‌కు ఇరాన్ అధ్యక్షుడు

న్యూఢిల్లీ, ఆగస్టు 14: ఇరాన్ అధ్యక్షుడు మసూ ద్ పెజిష్కియాన్ త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. సెప్టెంబర్‌లో ఢిల్లీలో జరిగే బ్రిక్స్ సదస్సుకు ఆయన హాజరుకానున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొన్న వేళ భారత్ అధ్యక్షతన జరిగే అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొన నుండ డం కీలకంగా మారింది. అక్టోబర్ 2024లో రష్యా లో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా భారత ప్రధాని మోదీతో ఇరాన్ అధ్యక్షుడు భేటీ అయ్యా రు. ద్వైపాక్షిక సంబంధాలు, ప్రాంతీయ అంశాలపై చర్చించారు. గతేడాది బ్రెజిల్ వేదికగా ఈ సదస్సు జరగగా.. అనంతరం ఈ ఏడాది అధ్యక్ష బాధ్యతలను భారత్ స్వీకరించింది. బ్రిక్స్ కూటమిలో 2024లో ఇరాన్తోపాటు ఈజిప్టు, ఇథియోపియా, యూఏఈ, గతేడాది ఇండోనేసియా దేశా లు చేరాయి.దీంతో ప్రస్తు తం పూర్తిస్థాయి సభ్యదేశాల సంఖ్య 11కు చేరింది.



# తొలి సాదాబైనామా కేసు ఆమోదం

**(పాష సయ్యద్, ప్రజాతీర్పు వేములవాడ) ఆగస్టు 14**

సాదాబైనామా ద్వారా జరిగిన భూ లావాదేవీల క్రమబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా జిల్లాలోనే తొలి సాదాబైనామా కేసు ని తంగళ్లపల్లి మండలంలోని తంగళ్ళపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో ఆమోదం పొందడం ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని రెవెన్యూ డివిజనల్ అధికారి తెలిపారు. ఈ సందర్భంగా సిరిసిల్ల ఆర్డీఓ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన సాదాబైనామా కేసులను పారదర్శకంగా పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు భూ హక్కుల క్రమబద్ధీకరణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో తొలి కేసు ఆమోదం పొందడం సంతోషకరమైన పరిణామమని, అర్హత కలిగిన మరిన్ని సాదాబైనామా కేసులు ప్రభుత్వ మార్గదర్శకాలు మరియు నిబంధనల మేరకు అర్హులైన అన్ని కేసులను ఎటువంటి జాప్యం లేకుండా దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లో బాగంగా లబ్దిదారుడైన ఇటికాల శంకర్ కు తంగళ్ళపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో గల 5 సర్వే నెంబర్ లో గల 0.30 గుంటల భూమి కి సంబందించిన 13(డీ) ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమశీలో సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, తంగళ్లపల్లి తహసీల్దార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



## గోపాల్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా షూస్ పంపిణీ

**(రాంపెల్లి చంద్రశేఖర్ ప్రజా తీర్పు తాండూర్ మండలశీ రిపోర్టర్ ) ఆగస్టు 14**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సహకారంతో తాండూర్ మండలం గోపాల్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు షూస్ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గాట్ల నర్సయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డా. పెద్దబోయిన శంకర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా. పెద్దబోయిన శంకర్ మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం ద్వారా విద్య పట్ల వారిలో ఆసక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సౌందర్య, ఉపాధ్యాయులు ఆనంద్, స్రవంతి, పాఠశాల కమిటీ చైర్మన్ మల్లేశ్వరి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

**కోరుట్ల, ఆగస్టు 14 (ప్రజాతీర్పు)**

కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, రౌడీ షీటర్లు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని సూచించారు. ఎలాంటి నేరాలకు పాల్పడినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీ షీటర్ల ఫొటోలు, పూర్తి వివరాలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి, వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ఇట్టి కార్యక్రమంలో సీఐ లక్ష్మీనారాయణ, కోరుట్ల ఎస్ఐ శ్యామ్‌రాజ్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమగ్ర శిక్షలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 14 (ప్రజా తీర్పు)**



సమగ్ర శిక్షలో వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు కార్యాలయంలో కోఆర్డినేటర్లు, అసిస్టెంట్ స్టాటిస్టికల్ కోఆర్డినేటర్ల పోస్టులతో పాటు జిల్లా విద్యాశాఖాధికారి, ఎక్స్అఫీషియో జిల్లా ప్రాజెక్టు అధికారి కార్యాలయాల్లో అసిస్టెంట్ కోఆర్డినేటర్లు, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ల పోస్టులకు డిప్యూటేషన్/ఓ.డి. ప్రాతిపదికన నియామకాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హతలు, విద్యార్హతలు, నిబంధనలు, మార్గదర్శకాలకు సంబంధించిన పూర్తి వివరాలను పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 8న ప్రారంభమైందని, ఆగస్టు 17 చివరి తేదీ అని తెలిపారు. అర్హత కలిగిన ఆసక్తి గల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని డీఈఓ జి. శారద కోరారు.

# ఘనంగా "హర్ ఘర్ తిరంగా యాత్ర"

### దేశభక్తిని చాటుకున్న ప్రజలు, నాయకులు, విద్యార్థులు, వివిధ పాఠశాల టీచర్ల..

**(పగడాల రామారావు ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి) ఆగస్టు 14**




గార్ల మండల కేంద్రంలో "హర్ ఘర్ తిరంగా యాత్ర"ను శుక్రవారం అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించారు. "మన జెండా - మన గర్వం - మన భారతం" అనే నినాదంతో స్థానిక మండల కేంద్రంలోడీజే సౌండ్ సిస్టంతో వీధుల్లో భారీ తిరంగా ర్యాలీ కొనసాగింది. ఈ యొక్క కార్యక్రమానికి అతిథులు,గా, మైనార్టీ మోర్చా మాజీ కార్యదర్శి, రావుక విమల్ కుమార్ జైన్ కుటుంబ సమేతంగా పాల్గొని విద్యార్థులకు, స్నాక్స్, పంచుతూ, తిరంగా ర్యాలీలో, విద్యార్థులకు ర్యాలీలో ఉత్సవం నింపుతూ ముందుకు తీసుకెళ్లినారుఈ సందర్భంగా స్థానిక మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు, నక్క శివకృష్ణ యాదవ్, మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని, జాతీయ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. మన దేశ గౌరవానికి, మన భాగస్వామ్యానికి సంకేతమైన ఈ తిరంగా యాత్రలో మండల ప్రజలు, యువకులు, నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని మహోద్యమంగా మార్చి జయప్రదం చేశారు. ఈ కార్యక్రమంలో మువ్వన్నెల జెండాలు చేతబూని "భారత్ మాతాకీ జై" అనే నినాదాలతో గార్ల పురవీధులు, డిజె సౌండ్ సిస్టం ఏర్పాటు చేసుకొని, జాతీయ గీతం ఆలపిస్తూ డీజే పాటలతో, మారుమోగాయి.పాల్గొన్నవారు: ప్రభుత్వ పాఠశాల, జెడ్ పి ఎస్ ఎస్, సమత హై స్కూల్, నిర్మల స్కూల్, విశ్వశాంతి విద్యాలయం, స్కూల్ టీచర్లు, అన్ని పాఠశాల7.8.9 తరగతి విద్యార్థి విద్యార్థినీలు, భారతీయ జనతా పార్టీ ఎనిమిదో వార్డ్ సభ్యులు గుగులోత్ భారతి దేవా, వీరస్వామి, బుచ్చిబాబు, రాంబాబు, గణేష్, విజయ్, సతీష్, వీర్య నాయక్, వాసు, అజ్మీర రామ్, స్థానికులు అందరూ పాల్గొనడం జరిగింది



## జుక్కల్ నుంచి తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరికలు

**జుక్కల్, ఆగస్టు 14, ( ప్రజా తీర్పు)**

కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం కు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు శుక్రవారం జుక్కల్ నియోజకవర్గ ఇన్చార్జ్ జాదవ్ ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ తాహెర్ సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. తెలంగాణ రాజ్యాధికార పార్టీ లో మల్లన్న సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు మాట్లాడుతూ... తెలంగాణలో సామాజిక న్యాయం, బీసీల రాజ్యాధికారం సాధనే లక్ష్యంగా పనిచేస్తున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్ధాంతాలు, తీన్మార్ మల్లన్న నాయకత్వంపై విశ్వాసంతో పార్టీలో చేరుతున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ...తెలంగాణలో బీసీల రాజకీయ సార్వభౌమత్వం సాధించడమే తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) ముఖ్య లక్ష్యమని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. కామారెడ్డి, నిజామాబాద్ రూరల్, బాల్కొండ, హుజూరాబాద్లలో అత్యధికంగా బీసీ ఓటర్లే ఉన్నప్పటికీ, రెడ్ల ప్రాతినిధ్యం నడుస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమం లో జుక్కల్ నియోజకవర్గ ఇన్చార్జ్ జాదవ్ ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ తాహెర్ నాయకులు పాలుగోన్నారు.



## తక్కువ నీటి అవసరం ఉన్న ఆరుతడి పంటలే మేలు

- ఇల్లందు ఏడిఏ లాల్ చంద్

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) ఆగస్టు 14**

టేకులపల్లి: ప్రస్తుత ఎల్నీనో ప్రభావంతో వర్షపాతం అనిశ్చితంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు ఈ వానాకాలంలో వరి సాగుకు దూరంగా ఉండాలని ఇల్లందు వ్యవసాయ శాఖ ఏ.డి.ఏ లాల్చంద్ సూచించారు. టేకులపల్లి మండలం లచ్చగూడెం గ్రామంలో శుక్రవారం రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటి అవసరమయ్యే పెసర, మినుము, నువ్వులు, జొన్న, కుసుమ వంటి ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. లచ్చగూడెం గడ్డి చెరువు ఆయకట్టు పరిధిలోని సుమారు 1,000 ఎకరాల్లో, అలాగే బోడు, కొప్పురాయి గ్రామాల్లో పారికలవాగు కింద ఉన్న సుమారు 250 ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేయాలని తెలిపారు. నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకొని పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా భవిష్యత్లో ఎదురయ్యే నీటి కొరతను అధిగమించడంతో పాటు రైతులు నష్టపోకుండా ఉండవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ బోడా మంగీలాల్ నాయక్, లచ్చగూడెం సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఏవో అన్నపూర్ణ, ఏ ఈ ఓ రెహానా, రైతులు పాల్గొన్నారు.



## మంచిర్యాల లైన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో పోషకాహార కిట్ల పంపిణీ

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 14**

మంచిర్యాల లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంచిర్యాల మండలం లోని 25 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార ఉచిత కిట్టులను అందజేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛందంగా మంచిర్యాల లైన్స్ క్లబ్ వారు ముందుకు వచ్చి వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార ఉచిత కీట్టులను అందజేయడం జరిగినది ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ మెంబర్ లందరికీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తరఫున ధన్యవాదాలు తెలియజేయడం జరిగినది అదేవిధంగా జిల్లాలో ఎవరైనా దాతలు ముందుకు వచ్చి పౌష్టికాహారం క్షయ వ్యాధిగ్రస్తులకు ఇవ్వడం వల్ల మనము వారిని వ్యాధి నుండి దూరం చేయవచ్చును ప్రభుత్వ పరంగా క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించడము నమోదు చేయడము మందులు ఇవ్వడం అదేవిధంగా పౌష్టికాహారం కోసం ప్రతినెల 1000 రూపాయలతో పాటు ఎన్జీవోలు దాతల సహకారంతో పౌష్టికాహార కిట్లను అందజేయడం వలన వారిలో ఇమ్యూనిటీ పవర్ పెరగడము ఇతర వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పడడం జరుగుతుంది కావున ఈ సహకారం వల్ల మందులు పౌష్టికాహారము అవగాహన వలన వారు కోలుకుంటారు కావున స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరినారు మంచిర్యాల లైన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ వెంకటేశ్వరరావు మధుసూదన్ రెడ్డి జిల్లాలోని లైన్స్ క్లబ్ మెంబర్ లందరూ ఈ మంచి కార్యక్రమంలో పాల్గొని తమ వంతు సహకారాన్ని అందజేయడం జరిగినది అదేవిధంగా పౌష్టికాహార కిట్టులను తయారు చేసి వారు వ్యాధిగ్రస్తులకు అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో లెన్స్ క్లబ్ నెంబర్లు మరియు జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్,సిహెచ్ వోలు నాందేవ్,శ్రీనివాస్, అల్లాడి శ్రీనివాస్,క్షయ వ్యాధి సమన్వయకర్త సురేందర్,సాయి రెడ్డి,ఇంకా ఎస్ టి ఎస్ లు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం

- మాజీ మంత్రి జీవన్ రెడ్డి పరామర్శ
- నిరుపేద కుటుంబం అయిన నర్సయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగస్టు 14.**



జగిత్యాల మండలం లోని బాలపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబం మెడపట్ల నర్సయ్య మరణించగా వారి కుటుంబ సభ్యులను మాజీమంత్రి, బి ఆర్ ఎస్ రాష్ట్ర కార్యదర్శి టి. జీవన్ రెడ్డి శుక్రవారం పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. అంత్యక్రియలు అయిన తదుపరి మరణించిన నర్సయ్య కుటుంబానికి ఇల్లు లేకపోవడంతో ఎస్ సి కమ్యూనిటి భవనంలో ఉంటున్న వారిని కలిసి వారికి అండగా ఉంటాను అని ధైర్యం చెప్పడంతో పాటు ఆర్థిక సహాయం అందించారు మరణించిన ఇల్లు లేని నిరుపేద మెడపట్ల నర్సయ్య కుటుంబానికి ఇల్లు మంజూరు ఇవ్వాలని అన్నారు భార్యకు వితంతు పెంక్షన్ కుటుంబ సభ్యులకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలని సూచించారు నిరుపేద కుటుంబం అయిన నర్సయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి అని అన్నారు. వారి వెంట. మాజీ ఎంపీపీ ధర రమేష్ బాబు,మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ పులి రాము తదితర నాయకులు పాల్గొన్నారు

# కౌశిక్‌రెడ్డిని హుజురాబాద్ లో ఉంచకండి..

### కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ వాసాల రామస్వామి

**జమ్మికుంట ఆగస్టు 14 ప్రజాతీర్పు**



హుజూరాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు ప్రభుత్వాన్ని, మంత్రులను ఒప్పించి పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళు తీసుకొస్తున్నారని జమ్మికుంట మండల కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ వాసాల రామస్వామి అన్నారు. ప్రజలకు అవసరమైన పథకాలు, సౌకర్యాల కోసం కృషి చేయాల్సిన సమయంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అల్లర్లు, గొడవలను ప్రోత్సహించడం సరికాదని మండిపడ్డారు. కౌశిక్‌రెడ్డి వల్ల హుజూరాబాద్ ప్రజలు ఏం నేర్చుకోవాలని ఆయన ప్రశ్నించారు. పోలీస్‌స్టేషన్‌లో ఆందోళనలు చేయడం, అధికారులను దూషించడం, రాజకీయ ప్రత్యర్థులపై తీవ్ర వ్యాఖ్యలు చేయడం, మంత్రులు, ముఖ్యమంత్రిపై విమర్శలు చేయడం నేర్చుకావాలా, ఇది అభివృద్ధికి మార్గం కాదన్నారు. ప్రజలకు కావాల్సిన విద్య, వైద్యం, రోడ్లు, ఇళ్లు, సంక్షేమ పథకాలపై ప్రశ్నించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. "టీఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా కళ్లు తెరవాలి. కౌశిక్‌రెడ్డి రాజకీయ విధానాల వల్ల ప్రజలకు ఏం ప్రయోజనం కలుగుతోందో ఆలోచించాలి. ఆయనకు బుద్ధి చెప్పాల్సిన బాధ్యత మీపైనా ఉంది" అని వాసాల రామస్వామి వ్యాఖ్యానించారు. గత ఉపఎన్నికల రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ.. ఈటల రాజేందర్, కేసీఆర్ మధ్య రాజకీయ విభేదాల నేపథ్యంలో మూడో వ్యక్తిగా కౌశిక్‌రెడ్డిని హుజూరాబాద్ ప్రజలపై రుద్దారని విమర్శించారు. ఈటల రాజేందర్ హైదరాబాద్‌కు వెళ్లిపోయారని, ఇప్పుడు కౌశిక్‌రెడ్డిని కూడా హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని కేసీఆర్, కేటీఆర్, వినోద్‌కుమార్‌లను కోరారు. "కౌశిక్‌రెడ్డి చేస్తున్న రాజకీయ గొడవలను హుజూరాబాద్ ప్రజలు ఇక భరించే పరిస్థితిలో లేరు. హుజూరాబాద్‌ను అభివృద్ధి బాటలో నడిపించే నాయకత్వం కావాలి. ప్రజల కోసం పనిచేస్తున్న ప్రణవ్‌బాబుకు అండగా నిలిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది" అని వాసాల రామస్వామి అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడం, వ్యక్తిగత రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వడం మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని కౌశిక్‌రెడ్డికి ఆయన హితవు పలికారు.

# ఎండపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్ష రేసులో అల్లె వెంకటేష్ యాదవ్

( ఎలుక భగవాన్ యాదవ్ ,ప్రజాతీర్పు, ఎండపల్లి) ఆగస్టు 14 :





జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలంలోని గొడిశెలపేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు అల్లె వెంకటేష్ యాదవ్ బిఆర్ఎస్ ఎండపల్లి మండల పార్టీ అధ్యక్ష పదవి రేసులో ఉన్నట్లు వార్త మండల వ్యాప్తంగా గుప్పుమంటుంది. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భావం నుండి ప్రస్తుత భారత రాష్ట్ర సమితి వరకు పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా, సౌమ్యుడిగా, ఏనాడు పదవులు ఆశించని నేతగా అల్ల వెంకటేష్ యాదవ్ కు పేరుంది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని, యువతలో ఉత్సాహాన్ని నింపుతూ ప్రోత్సహించాడు. పార్టీ అధిష్టానం ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తున్నాడు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కు అనుచరుడుగా ఉంటూ ప్రతి ఎన్నికల్లో కొప్పుల గెలుపు కోసం అహర్నిశలు అలుపెరుగని కృషి చేసి కొప్పులకు నమ్మిన బంటుగా ఉన్నాడు. ఎండపల్లి మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా అల్లె వెంకటేష్ యాదవ్ కొనసాగుతున్నారు. గతంలో తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి వెల్గటూర్ మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన వెంకటేష్ యాదవ్ కొప్పుల గెలుపుకు మద్దతుగా తన సామాజిక వర్గాన్ని ఏకం చేసి ఏకగ్రీవ తీర్మానం చేయించి, కొప్పులకు ఓట్లు వేయించడంలో సఫలీకృతుడయ్యాడు. ప్రస్తుతం మండలంలో గులాబీ పార్టీ వాడిపోతున్న తరుణంలో వెంకటేష్ యాదవ్ లాంటి సమర్ధవంతుడైన నాయకుడికి పార్టీ బాధ్యతలు అప్పగిస్తే పార్టీకి పూర్వ వైభవం తీసుకురావచ్చని కార్యకర్తలంతా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోనే బలమైన యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు గతంలో బిఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన వారిలో అధిక శాతం ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పార్టీలో ఉండగా, కొందరు స్తబ్దతగా ఉంటూ క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. వెంకటేష్ యాదవ్ కు మండల వ్యాప్తంగా అందరితో సత్సంబంధాలు ఉండడమే కాకుండా, తన సామాజిక వర్గంలో పట్టు నిలుపుకొని ఏకధాటిగా ఆరుసార్లు ఏకగ్రీవంగా యాదవ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అధికార కాంగ్రెస్ పార్టీ వెంకటేష్ యాదవ్ ను కాంగ్రెస్ పార్టీలో చేర్పించుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేసినా ఆయన పార్టీ గీత దాటలేదు. బిఆర్ఎస్ పార్టీని వీడలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయనకు మండల పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించినట్లయితే స్తబ్దతగా ఉన్న నాటి తెలంగాణ ఉద్యమకారులు, యాదవ సంఘం నాయకులతో పాటు సబ్బండ వర్గాలు బిఆర్ఎస్ కు చేరువయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. కాగా గతంలో పార్టీ అధ్యక్ష పదవి రెండు పర్యాయాలు బిసి సామాజిక వర్గానికే అప్పగించగా, మళ్లీ బీసీ కే కేటాయిస్తారా అనే సందేహం కార్యకర్తల్లో నెలకొంది. ఒకవేళ బీసీ కేటాయిస్తే అల్లె వెంకటేష్ యాదవ్ కు బాధ్యతలు అప్పగిస్తే పార్టీ పురోగతి చెందుతుందని కార్యకర్తల వాదన. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సైతం అల్లె వెంకటేష్ యాదవ్ వైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం..? ఏదేమైనా ఎండపల్లి మండలంలో బిఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందా... లేదా? వేచి చూడాల్సిందే.

# నిరాధార ఫిర్యాదులను ఉపేక్షించం

- తప్పుడు ఫిర్యాదుదారుడికి లోకాయుక్త రూ.10 వేల జరిమానా

పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 14 (ప్రజా తీర్పు)



అధికారులపై నిరాధార ఆరోపణలు చేస్తూ తప్పుడు ప్రచారం చేసేవారిని ఉపేక్షించబోమని కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌కు చెందిన బొబ్బిలి సత్యనారాయణ 2023 జనవరి 2న ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి అనుమతులు లేవంటూ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీనిపై అధికారులు విచారణ జరిపి నివేదిక సమర్పించగా.. ఫిర్యాదు నిరాధారమైనదని, వేధింపులకు ఉద్దేశించినదిగా పేర్కొంటూ లోకాయుక్త 2025 డిసెంబర్ 22న కొట్టివేసిందన్నారు. తప్పుడు ఫిర్యాదుతో లోకాయుక్త, ప్రభుత్వ అధికారుల విలువైన సమయాన్ని వృథా చేసినందుకు తెలంగాణ లోకాయుక్త చట్టంలోని సెక్షన్ 13-ఏ కింద రూ.10 వేల జరిమానా విధించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. లోకాయుక్త ఆదేశాల మేరకు ఆ మొత్తాన్ని రెవెన్యూ రికవరీ చట్టం కింద వసూలు చేసి ముఖ్యమంత్రి సహాయనిధిలో జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై వాస్తవాధారాలతో చేసే ఫిర్యాదులను ప్రభుత్వం స్వాగతిస్తుందని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం లేదా అధికారులను అప్రతిష్ఠపాలు చేసేందుకు నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.




# హమాలీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

(రాంపెల్లి చంద్రశేఖర్ ప్రజా తీర్పు తాండూర్ మండలం రిపోర్టర్) ఆగస్టు 14

హమాలీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో తాండూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జ్యోత్స్నను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా గుమాస ప్రకాష్, హమాలీల సంఘం సీఐటీయూ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు, దాగం రాజారాం, సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం హమాలీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, నెలకు రూ.6,000 పెన్షన్ అందించాలని కోరారు. ప్రమాదాల్లో మరణించే హమాలీ కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం అందించాలని, హమాలీలకు ఇన్సూరెన్స్, ప్రమాద బీమా సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను హమాలీ కార్మికులకు పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం హమాలీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు అన్నారు. హమాలీల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లుల హమాలీలు, బజార్ హమాలీలు, గోడౌన్స్ హమాలీలు, ఐకేపీ హమాలీలు, గ్రామీణ హమాలీలు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా నిలిచి భవిష్యత్తులో జరిగే పోరాటాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, హమాలీ కార్మికులు ఇందూరి మల్లేష్, చింతపురి లక్ష్మణ్, ధర్మరాజుల వెంకటేష్, చదువుల రవీందర్, తోగారి శ్రీను, తాండూర్ మల్లేష్, మాసాడి సుధాకర్, కొండు రాములు, ఆయిల్ల శంకర్, పుట్ట రమణ, రుకుంబాపు, మాసాడి తిరుపతి, లెక్కల జగదీష్, ధరణి బుచ్చయ్య, ఒడ్నాల చందు, ఇందూరి బానేష్, కామెరా బాపు తదితరులు పాల్గొన్నారు.



# గార్ల ప్రభుత్వ ఆసుపత్రి సీ.హెచ్.సీ.లో 5 గురు వైద్యుల నియామకం

- ఏ డాక్టరు.. ఏ రోజుల్లో విధులు నిర్వహిస్తారో వివరాలు ప్రజలకు తెలపాలి

(పగడాల రామారావు ప్రజా తీర్పు గార్లమండల ప్రతినిధి) ఆగస్టు 14

గార్ల స్థానిక మండల కేంద్రం ప్రభుత్వ ఆసుపత్రి (సీహెచ్‌సీ)లో 5గురు నూతన వైద్యుల నియామకం జరిగిందన్న సమాచారంతో మండల ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. వైద్యుల సంఖ్య పెరగడంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.అయితే 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన వైద్యులు ఆసుపత్రిలో ఏ వైద్యుడు ఏ రోజు విధులు నిర్వహిస్తారు..! ఏ వైద్యుడికి ఏ విభాగం బాధ్యతలు అప్పగించారు... ,! అనే వివరాలను ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని మండల ప్రజలు కోరుతున్నారు.వైద్యుల డ్యూటీ రోస్టర్‌ను ఆసుపత్రి ప్రాంగణంలో, ఓపీ విభాగం వద్ద స్పష్టంగా ప్రదర్శించడంతో పాటు, అందులో వైద్యుల పేర్లు, విధులు నిర్వహించే రోజులు, సమయాలు, విభాగాల ప్రదర్శన వివరాలు అందుబాటులో ఉంచాలని ఏజెన్సీ కోరుతున్నారు. తెలంగాణలోని ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో సిహెచ్ సి లకు డ్యూటీ డాక్టర్ల వివరాల డిస్‌ప్లే, డాక్టర్ల రోస్టర్ వంటి వివరాలను పారదర్శకంగా ప్రదర్శించి ప్రజలకు తెలుపవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. దూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చే రోగులు ముందుగానే ఏ రోజు ఏ వైద్యుడు అందుబాటులో ఉంటారో తెలుసుకునే అవకాశం ఉంటే వారికి సమయం, ప్రయాణ ఖర్చు ఆదా అవుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.అలాగే ఐదుగురు వైద్యులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా జిల్లా ఉన్నత వైద్యాధికారులు పర్యవేక్షించాలని, రోగులకు నిరంతరాయంగా వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు పారదర్శకంగా వైద్య సేవలు అందించేందుకు వైద్యుల డ్యూటీ రోస్టర్‌ను వెంటనే ప్రకటించి, ఆసుపత్రిలో అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# ఇల్లందు ఏరియా ఉత్తమ ఉద్యోగులను అభినందించిన సింగరేణి జి.ఎం. కృష్ణయ్య

(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) ఆగస్టు 14



ఇల్లందు:ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, ఇల్లందు ఏరియాలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా వివిధ గనులు, విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను ఏరియా జనరల్ మేనేజర్ వి. కృష్ణయ్య గురువారం తనకార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా జి.ఎం. మాట్లాడుతూ విధుల పట్ల క్రమశిక్షణ, అంకితభావం, కష్టపడి పనిచేసే తత్వమే వీరిని ఉత్తములుగా నిలిపిందని అన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ విధులు నిర్వహించి తోటి ఉద్యోగులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ స్థాయికి చేరడంలో కుటుంబ సభ్యుల ప్రోత్సాహం కూడా కీలకమని పేర్కొన్నారు.ఉత్తమ (ఎన్.సి.డబ్ల్యూ.ఏ) ఉద్యోగి

1. జి.ఏ. శ్రీనివాస్ -- మెకానికల్ ఫోర్‌మన్, కే.ఓ.సి.-2

వీరిని కొత్తగూడెంలో సింగరేణి సి.ఎం.డి. జ్యోతి బుద్ధ ప్రకాష్, ఐ.ఏ.ఎస్. చేతుల మీదుగా సన్మానించనున్నారు.

ఉత్తమ ఉద్యోగులు

1. బుర్గుల రామారావు -- హెడ్ ఓవర్‌మన్, కే.ఓ.సి.-2
2. మాలోత్ హరి సింగ్ -- పంప్ ఆపరేటర్, కే.ఓ.సి.-2
3. సోలం వెంకటేశ్వర్లు -- జనరల్ అసిస్టెంట్, ఏరియా స్టోర్
4. సిలబోయిన వేణు -- జనరల్ అసిస్టెంట్, పర్సనల్ డిపార్ట్‌మెంట్
5. ఇర్పా కృష్ణవేణి -- జనరల్ అసిస్టెంట్, క్వాలిటీ డిపార్ట్‌మెంట్

ఈ ఉత్తమ ఉద్యోగులను ఆగస్టు 15న ఉదయం 9.30 గంటలకు ఇల్లందు ఏరియా సి.ఇ.ఆర్. క్లబ్, జె.కె. కాలనీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఏరియా జి.ఎం.వి. కృష్ణయ్య చేతుల మీదుగా సన్మానించనున్నారు. ఉద్యోగులు కుటుంబ సభ్యులతో హాజరుకావాలని అధికార ప్రతినిధి అజ్మీర తుకారాం కోరారు.

# అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టివేత

(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు, ఇల్లంతకుంట ) ఆగస్టు 14

పొత్తూరు గ్రామ శివారులోని బిక్కావాగు వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ ను అందిన సమాచారం మేరకు పొత్తూరు గ్రామానికి చెందిన కుంభం శ్రీనివాస్ టీజీ 24టి0047 నంబర్ గల ఇసుక ట్రాక్టర్ ను పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి. లక్ష్మి తెలియజేసారు అక్రమ ఇసుక తరలింపుకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు

# దొంగతనానికి పాల్పడిన దొంగను అరెస్ట్ చేసిన పోలీసులు...

- మరిపెడ సిఐ ఎల్.పవన్ కుమార్,సీరోలు ఎస్సై జి.సంతోష్ ఆధ్వర్యంలో...

కురవి/సీరోలు ఆగస్టు 14 (ప్రజా తీర్పు విలేఖరి)

గత వారం రోజుల క్రితం 6.8.2026 రోజున ఉమ్మడి కురవి మండలంలోని సీరోలు మండల పరిధిలోని తాళ్ళ సంకిస గ్రామంలో కురుపల్లి బాలక్రిష్ణ ఇంట్లో తలుపులు పగలగొట్టి ఇంట్లో బీరువాలను పగలగొట్టి బంగారం మరియు డబ్బులు దొంగిలిచినటువంటి వ్యక్తి ని శుక్రవారం నాడు పెట్టుకోవడం జరిగింది.అట్టి దొంగ యొక్క వివరాలు అజ్మీర సాగర్ (తండ్రి) మదార్,సీరోలు మండలం లోని వస్త్రం తండా (నడిమి తండా) కు చెందిన అజ్మీర సాగర్ (తండ్రి) మదార్,అట్టి దొంగను సాంకేతిక ఆధారాల ద్వారా అరెస్ట్ చేయడం జరిగింది.వెంటనే అట్టి దొంగను నిన్న రిమాండ్ కు తరలించడం జరిగింది.



# యాంగ్ ఇండియా స్టూడెంట్ కిట్ ఉచిత పంపిణి

(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 14

మంచిర్యాల బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు బెల్లంపల్లి పట్టణంలో 7వ వార్డ్, సుభాష్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన యంగ్ ఇండియా స్టూడెంట్ కిట్" పథకం ద్వారా విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్న షూష్ ను విద్యార్థులకు పంపిణీ చేసిన బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి.దావ స్వాతి-రమేష్ బాబు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్, మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని వారు సూచించారు. పాఠశాల సిబ్బంది, వార్డ్ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు..అనంతరం 7వ వార్డ్ లోని ఇందిరమ్మ ఇంటి పథకం లబ్ధిదారులు పెండెం రాజు ఇందిరమ్మ ఇంటి నూతన గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది..

## రాష్ట్రీయ హిందూ పరిషత్ మహిళా కమిటీ నియామకం

పెద్దపల్లి ప్రతినిధి ఆగస్టు 14 ,(ప్రజా తీర్పు)





రాష్ట్రీయ హిందూ పరిషత్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు జాపతి రాజేష్ పటేల్ సూచన మేరకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మండల భూపాల్ పెద్దపల్లి జిల్లా రణచండి (మహిళా విభాగం) నూతన కమిటీని నియమించారు. అధ్యక్షురాలిగా కన్నం అనూష, ఉపాధ్యక్షురాలిగా కర్రె అర్చనను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన కన్నం అనూష, కర్రె అర్చన మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు మండల భూపాల్, జిల్లా అధ్యక్షుడు జాపతి రాజేష్ పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మహిళా విభాగాన్ని బలోపేతం చేసేందుకు బాధ్యతాయుతంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

# తాండూర్ ఐబీ అండర్ బ్రిడ్జి వద్ద దుకాణాలు, వాహనాల పార్కింగ్‌పై నిషేధం

(రాంపెల్లి చంద్రశేఖర్ ప్రజా తీర్పు తాండూర్ మండలం రిపోర్టర్) ఆగస్టు 14



తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు, ప్రయాణికులకు తాండూర్ పోలీస్ శాఖ తరఫున ముఖ్యమైన విజ్ఞప్తి చేస్తున్నట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ రావు తెలిపారు. తాండూర్ ఐబీ అండర్ బ్రిడ్జి కింద ఉన్న చౌరస్తా వద్ద ప్రయాణికులకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకు పోలీస్ శాఖ, హైవే సిబ్బంది సమన్వయంతో అక్కడ ఏర్పాటు చేసిన వాణిజ్య దుకాణాలను తొలగించినట్లు తెలిపారు. ముఖ్యంగా మంచిర్యాల, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేలా, రహదారిపై ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అండర్ బ్రిడ్జి కింద లేదా సమీప ప్రాంతంలో ఇకపై ఎలాంటి దుకాణాలు, వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. అదేవిధంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలు సహా ఏ వాహనాన్నీ ఈ ప్రాంతంలో పార్కింగ్ చేయడానికి అనుమతి లేదని తెలిపారు. అండర్ బ్రిడ్జి సమీపంలో వాహనాలను పార్కింగ్ చేసినట్లు గుర్తిస్తే అక్కడ విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది వెంటనే చర్యలు తీసుకుని, నిబంధనల ప్రకారం సంబంధిత వాహనాలకు జరిమానాలు విధించడం జరుగుతుందని హెచ్చరించారు. కావున తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సహకరించాలని సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ రావు విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత, ప్రయాణికుల సౌకర్యం, సాఫీగా ట్రాఫిక్ నిర్వహణ కోసం ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

# డిసెంబర్ నాటికి వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలి

- పనులు వేగవంతం చేయాలి.. నాణ్యతలో రాజీ పడొద్దు : జిల్లా కలెక్టర్ అంకిత్
- తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ నీటిని పొదుపుగా వినియోగించాలి
- వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి
- విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలి





**(పొనకంటి ఉపేందర్ రావు**

**ప్రజాతీర్పు,ఇల్లందు) ఆగస్టు 14**

ఇల్లందు :భద్రాది కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలో జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం విస్తృతంగా క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.37.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు, ఇల్లందు చెరువులో నీటి నిల్వలు, సుందిమళ్ల టీజీడబ్ల్యూఆర్ఎస్ పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, వసతి, భోజనం, మౌలిక వసతులను పరిశీలించారు. సంబంధిత అధికారులతో ఆయా అంశాలపై సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఇల్లందు పట్టణంలో రూ.37.50 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తూ ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ విభాగాలు, ఐసీయూ, ఎమర్జెన్సీ విభాగం, వార్డులు, వెయిటింగ్ హాల్, మరుగుదొడ్లు తదితర సదుపాయాల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాలను సౌకర్యవంతంగా, ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. నూతన వంద పడకల ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఇల్లందు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. అత్యవసర వైద్య సేవలు సకాలంలో అందేలా ఎమర్జెన్సీ, ఐసీయూ తదితర విభాగాలను అవసరమైన సౌకర్యాలతో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డిసెంబర్ నాటికి ఆసుపత్రి నిర్మాణ పనులను పూర్తిస్థాయిలో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకొని పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్మాణ సంస్థ, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గించరాదని, ఉపయోగించే నిర్మాణ సామగ్రి నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నిర్మాణ పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ఇదే క్రమంలో ఇల్లందు చెరువును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. చెరువులోని ప్రస్తుత నీటిమట్టం, నీటి నిల్వ, పూర్తి స్థాయి నీటిమట్టం, గరిష్ట నీటిమట్టం, రోజువారీ తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్న నీటి పరిమాణం, నీటి డిశ్చార్జ్ తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు పూర్తి స్థాయి నీటిమట్టం 219.150 మీటర్లు, గరిష్ట నీటిమట్టం 219.750 మీటర్లు కాగా, పూర్తి నిల్వ సామర్థ్యం 45 ఎంసీఎఫ్టీ, నీటి విస్తీర్ణం 136.23 ఎకరాలు, క్యాచ్‌మెంట్ ఏరియా 26 చదరపు కిలోమీటర్లుగా ఉందని అధికారులు తెలిపారు. రోజువారీ తాగునీటి అవసరాల కోసం 0.0177 ఎంసీఎఫ్టీ నీటిని వినియోగిస్తున్నామని, ఇది సుమారు 5.01 లక్షల లీటర్లకు సమానమని అధికారులు వివరించారు. అందుబాటులో ఉన్న నీటి నిల్వలను తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని కలెక్టర్ సూచించారు. భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీటి నిర్వహణ చేపట్టాలని, నీటి వృథాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువు నీటి వినియోగం, సాగునీటి పరిస్థితిపై వ్యవసాయ శాఖ అధికారులతో కూడా కలెక్టర్ సమీక్షించారు. ఇల్లందు పరిధిలోని వ్యవసాయ భూములకు చెరువుల ద్వారా అందుతున్న సాగునీటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రొంపేడు, చల్లసముద్రం తదితర ప్రాంతాల్లో చెరువుల నీటితో సాగు చేస్తున్న పంటలు, సాగు విస్తీర్ణం, సాగునీటి లభ్యత తదితర వివరాలను తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో సాగు చేసే ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పెసర వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. విద్యా సంస్థల పనితీరుపై దృష్టి సారించిన కలెక్టర్, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని సుందిమళ్ల టీజీడబ్ల్యూఆర్ఎస్ పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, వసతి, భోజనం, మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠశాలలో అందుతున్న సదుపాయాలు, విద్యాబోధన, పాఠ్యపుస్తకాలు, యూనిఫార్ములు, వసతి, భోజనం తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం సాధించిన ఫలితాలను కొనసాగిస్తూ ఈ విద్యా సంవత్సరంలోనూ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక బోధన అందించాలని, ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిని ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పాఠశాలలోని లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ తదితర సదుపాయాలను విద్యార్థులు సక్రమంగా వినియోగిస్తున్నారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో పఠన అలవాట్లు, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందేలా అందుబాటులో ఉన్న సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించేలా చూడాలని సూచించారు. పాఠశాల భవనంలో వర్షాకాలంలో లీకేజీ సమస్యతో పాటు భోజనశాలలో కూడా లీకేజీలు ఉన్నాయని ప్రధానోపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి పంపించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మరమ్మతు పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని సూచించారు. భోజనశాలను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. వంటకు వినియోగిస్తున్న గ్యాస్ సిలిండర్లు, ఆహార పదార్థాల సరఫరా, ఫుడ్ మానిటరింగ్ కమిటీ పనితీరు తదితర వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్ అక్కడ నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు, ఇతర నిత్యావసర సరుకులు, కూరగాయల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. సరుకులను సక్రమంగా నిల్వ చేయాలని, నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పరిశుభ్రమైన వాతావరణం, పౌష్టికాహారం అందించడం అధికారుల బాధ్యత అని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు . పాఠశాలలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనల్లో కలెక్టర్ వెంట తహసీల్దార్ ఖాసీం, ఎంపీడీవో ధన్సింగ్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, డాక్టర్ చంద్రశేఖర్. ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ కార్యక్రమంలో బీఎల్ఏలకు సన్మానం

**సూరారం, ఆగస్టు 13: ప్రజా తీర్పు**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ (ూ×=) కార్యక్రమంలో గత రెండుష్ట్రని నెలలుగా నిర్విరామంగా సేవలందించిన బూత్ లెవల్ ఏజెంట్ల (దీూూ)ను కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. సూరారంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై బీఎల్ఏలను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా కోలన్ హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "ఒకే చోట ఒకే ఓటు" అనే లక్ష్యంతో చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా ఓటర్ల జాబితాలోని అవకతవకలను గుర్తించేందుకు బీఎల్ఏలు కీలకంగా పనిచేశారని అన్నారు. నకిలీ ఓట్లు, ఒకే వ్యక్తికి పలు చోట్ల నమోదైన ఓట్లు, అర్హత లేని ఓట్లను గుర్తించడంలో వారు అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు జాబితాలో ఉండేలా, అనర్హులు మరియు నకిలీ ఓట్లు తొలగించేలా కృషి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని హన్మంత్‌రెడ్డి అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్ఏలు చేసిన సేవలకు కాంగ్రెస్ పార్టీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో డివిజన్ అధ్యక్షులు నాగిరెడ్డి, ఆకుల హరికిరణ్ పటేల్, మోహన్ రెడ్డి, శివకుమార్ గౌడ్, చైర్మన్ మన్నే రాజు,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్ లక్ష్మి, రాజు చారీ,తులసి, మైనారిటీ సెల్ అధ్యక్షులు గఫర్ మరియు ఇతర కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వృద్ధాప్య, బీడీ పెన్షన్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

- బీఆర్ఎస్ నాయకులు నల్లగాష హరీష్ యాదవ్.

**జమ్మికుంట ఆగస్టు 14 ప్రజాతీర్పు**



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వృద్ధాప్య పెన్షన్లు, బీడీ కార్మికుల పెన్షన్లను పెంచి అర్హులైన ప్రతి ఒక్కరికీ వెంటనే మంజూరు చేయాలని బీఆర్ఎస్ నాయకులు నల్లగాష హరీష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల ప్రభుత్వం కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తులు స్వీకరించేందుకు అవకాశం కల్పించినప్పటికీ, మీ సేవ కేంద్రాల సైట్‌లో వృద్ధాప్య పెన్షన్, బీడీ కార్మికుల పెన్షన్ దరఖాస్తులకు సంబంధించిన ఆప్షన్లు కనిపించడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలనుకుంటున్న వృద్ధులు, బీడీ కార్మికులు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు.అదేవిధంగా ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌లో కూడా వృద్ధాప్య మరియు బీడీ కార్మికుల పెన్షన్లకు సంబంధించిన స్పష్టమైన కాలమ్ లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రభుత్వం నిజంగా వీరి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుందా? లేక మీ సేవ సైట్‌లో ఏదైనా సాంకేతిక సమస్య కారణంగా ఆప్షన్లు కనిపించడం లేదా? అనే విషయాలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు, వయోభారంతో జీవనం సాగించేందుకు ఇబ్బందులు పడుతున్న వృద్ధులు పెన్షన్లపై ఆశలు పెట్టుకున్నారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం చేయకుండా, అర్హులైన ప్రతి వృద్ధుడు, ప్రతి బీడీ కార్మికుడికి పెంచిన పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెన్షన్ల దరఖాస్తులపై ఉన్న సందిగ్ధతను వెంటనే తొలగించి, మీ సేవ కేంద్రాల్లో సంబంధిత ఆప్షన్లను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, పెంచిన పెన్షన్లను అర్హులైన వారికి తక్షణమే మంజూరు చేయాలని నల్లగాష హరీష్ యాదవ్ తెలిపారు.



## ఖానాపూర్ మండలంలో పింఛన్లు, సీ.ఎఫ్.సీ. నిధులు, పంచాయతీ పరిపాలనపై వీడియో కాన్ఫరెన్స్

**నర్సంపేట రూరల్, ఖానాపూర్, ఆగస్టు 14 (ప్రజాతీర్పు)**

పంచాయతీరాజ్ కమిషనర్ ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఖానాపూర్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో చేయూత పింఛన్లు, 16వ ఆర్థిక సంఘం సి ఎఫ్ సి నిధులు, పంచాయతీ పరిపాలనకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. చేయూత పింఛన్లకు సంబంధించి వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు ఫైలేరియా బాధితులు, చేనేత కార్మికులు, డయాలసిస్ రోగులు అనే 7 కేటగిరీలలో అర్హులైన వారి దరఖాస్తులను స్వీకరించి పరిశీలించనున్నట్లు తెలియజేశారు. ముఖ్యంగా ఒంటరి మహిళల పింఛన్‌కు సంబంధించిన ధ్రువపత్రం పరిశీలన, జారీ ప్రక్రియ ఎంపీడీవో కార్యాలయం ద్వారా జరుగుతుందని, ఇందుకు ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఖానాపూర్ మండల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, అర్హత ఉన్న వారు తమ పింఛన్ దరఖాస్తులను సకాలంలో సంబంధితగ్రామపంచాయతీ కార్యాలయాల్లో సమర్పించాలని ఎంపీడీవో వి. అద్వైత కోరారు. గ్రామ పంచాయతీల నుంచి స్వీకరించిన పింఛన్ దరఖాస్తులను మండల కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా సంబంధిత పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే సి ఎఫ్ సినిధుల వినియోగం, పంచాయతీ పరిపాలన, గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు తగినసూచనలుఅందించారు.



## గ్రామాలు, వార్డుల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 14,(ప్రజా తీర్పు)**

జిల్లాలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెద్దపల్లి ఐడీఓసీలో తాగునీటి సరఫరా, సమస్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి గ్రామం, వార్డులో తాగునీటి సమస్యలను గుర్తించాలని సూచించారు. గ్రామాలు, వార్డుల వారీగా నీటి సరఫరా పరిస్థితి, ఎదురవుతున్న సమస్యలు, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి అందించాలని ఆదేశించారు.

### నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ

ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగునీరు అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ, సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులను క్షేత్రస్థాయిలోనే గుర్తించి వెంటనే పరిష్కరించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ గంగాధర శ్రీనివాస్, గ్రిడ్ ఈఈ పూర్ణచందర్, ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గడి బురుజుల పరిరక్షణకు బీజేపీ పోరాటం

- మైసమ్మ తల్లి ఆలయ షెడ్డును తొలగించడంపై ఆగ్రహం
- 48 గంటల్లో అక్రమ నిర్మాణాలు తొలగించాలి.. లేదంటే మున్సిపల్ ముట్టడి: బీజేపీ నేతల హెచ్చరిక

**కోరుట్ల ఆగస్టు 14 (ప్రజాతీర్పు)**



పట్టణంలోని చారిత్రక గడి బురుజులు, వాటి పరిసర ప్రాంతాలను బీజేపీ పట్టణ శాఖ, ధార్మిక సెల్--ఎండోమెంట్ విభాగం నాయకులు శుక్రవారం సందర్శించారు. గడి బురుజుల వద్ద ఉన్న మైసమ్మ తల్లి ఆలయ ప్రాంగణాన్ని ఇటీవల శుభ్రం చేసి, భక్తుల సౌకర్యార్థం షెడ్డును ఏర్పాటు చేయగా, కొందరు ఆ స్థలం తమదంటూ షెడ్డును తొలగించడంపై బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.బీజేపీ పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ, ధార్మిక సెల్--ఎండోమెంట్ కన్వీనర్ మాడవేణి నరేష్ మాట్లాడుతూ, గడి బురుజుల మధ్య నుంచి చివరి బురుజు వరకు అప్పటి దొర మైసమ్మ తల్లికి స్థలం కేటాయించినట్లు పేర్కొన్నారు. స్థలం తమదని చెబుతున్న వారు తమ వద్ద ఉన్న ఆధారాలతో మైసమ్మ తల్లి ఆలయం వద్దకు రావాలని, తాము పట్టణ ప్రజలతో కలిసి వచ్చి ఆధారాలను పరిశీలిస్తామని సవాల్ విసిరారు.మైసమ్మ తల్లి విగ్రహం కోసం ఏర్పాటు చేసిన షెడ్డును తిరిగి అదే ప్రాంతంలో నిర్మిస్తామని వారు స్పష్టం చేశారు. గడి బురుజులను ఆనుకొని సామిల్ డిపో, మినీ ఫంక్షన్ హాల్, ఆయిల్ మిల్ వంటి నిర్మాణాలు ఎలా జరిగాయని ప్రశ్నించారు. అదేవిధంగా పురాతన కోనేరు స్థలాన్ని కూడా కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తిరుమల వాసు, కౌన్సిలర్ సాయి చందు, జిల్లా కార్యదర్శి సుదవేని మహేష్ మాట్లాడుతూ, షెడ్ నిర్మాణానికి ముందు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి అనుమతి తీసుకున్నామని తెలిపారు. గడి బురుజుకు 15 అడుగుల దూరంలో షెడ్ నిర్మించామని, అలాంటి షెడ్డును ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు.పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద మున్సిపల్ కమిషనర్ ఏర్పాటు చేసిన సూచిక బోర్డును మీడియాకు చూపించారు. గడి బురుజుల పరిధిలో 100 మీటర్లలోపు నిర్మాణాలు చేయడం నేరమని బోర్డులో పేర్కొన్నప్పటికీ, నిబంధనలను పట్టించుకోకుండా నిర్మాణాలు ఎలా చేపట్టారని ప్రశ్నించారు.గడి బురుజులను ఆనుకొని ఉన్న నిర్మాణాలను 48 గంటల్లో తొలగించాలని, లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి నాయకులతో కలిసి పెద్ద ఎత్తున మున్సిపల్ ముట్టడి కార్యక్రమం చేపడతామని నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తొమ్మిది కుల సంఘాల ప్రతినిధులు, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు ఎర్ర రాజేందర్, చెట్లపెల్లి సాగర్, మ్యాకల గణేష్, గందె నవీన్, ఉపాధ్యక్షులు మైదం సత్యనారాయణ, తాళ్లపెల్లి శ్రీనివాస్, చిట్యాల రాజేంద్ర, రాధారపు నారాయణ, కార్యదర్శి బాల్క ప్రేమ్ సాగర్, సీనియర్ నాయకులు పోతేంటి శ్రీనివాస్, వేమూరి విజయ్, వెల్లాల నారాయణరెడ్డి, యువ మోర్చా అధ్యక్షుడు దమ్మ సంతోష్, దళిత మోర్చా అధ్యక్షుడు బెక్కం అశోక్‌తో పాటు బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్ల కేటాయింపు నిష్పక్షపాతంగా జరగాలి

- సీనియారిటీ ఆధారంగా అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఎంఆర్ఓకు వినతి

**కూకట్ పల్లి ,ఆగస్ట్ 14(ప్రజాతీర్పు)**

కూకట్‌పల్లి మండల పరిధిలో జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలని కోరుతూ సీనియర్ జర్నలిస్టులు మండల రెవెన్యూ అధికారి అశోక్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాల కేటాయింపులో అర్హత, సీనియారిటీ, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించిన అనంతరం పారదర్శకంగా కేటాయింపులు చేపట్టాలని కోరారు. ఏ విధమైన రాజకీయ, వ్యక్తిగత లేదా ఇతర ప్రభావాలకు తావులేకుండా అర్హులైన జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ను కలిసి ఇదే విషయం పై వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

**సీనియారిటీ ఆధారంగా పరిశీలిస్తాం: ఎంఆర్ఓ**

వినతిపత్రాన్ని స్వీకరించిన ఎంఆర్ఓ అశోక్‌కుమార్ స్పందిస్తూ.. జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపునకు సంబంధించిన అంశాలను నిబంధనల ప్రకారం పరిశీలిస్తామని తెలిపారు. అర్హత, సీనియారిటీ, క్షేత్రస్థాయి వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ప్రక్రియను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అర్హులైన జర్నలిస్టులకు న్యాయం జరిగేలా సంబంధిత అంశాలను పరిశీలిస్తామని పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్టులు పాల్గొనడం ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కట్టెల మల్లేష్, సి.హెచ్. రామారావు, మండపాక కళ్యాణ్ చక్రవర్తి, దాదె వెంకట్, ఎం.ఎస్. ఆనంద్‌రావు, అంబటి వెంకట్, జంగాల నాగార్జున, బి. శంకర్ పాల్గొన్నారు.



కూకట్‌పల్లి ఎంఆర్ఓ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ జర్నలిస్టులు.



## విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

**రామడుగు, ఆగస్టు 14 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

రామడుగు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రామడుగులో చదువుతున్న సుమారు 80 మంది విద్యార్థిని, విద్యార్థులకు కరీంనగర్‌కు చెందిన విద్యావేత్త పసుల మహేష్ శుక్రవారం ఉచితంగా క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి రంగనాథ్ శర్మ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు, వారికి అవసరమైన క్రీడా దుస్తులను స్వచ్ఛందంగా అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని, చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల అవసరాన్ని గుర్తించి సుమారు 80 మందికి స్పోర్ట్స్ డ్రెస్‌లు అందించిన పసుల మహేష్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ఆయన సేవా దృక్పథం ఇతరులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రంగనాథ్ శర్మ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రామడుగు ప్రధానోపాధ్యాయులు రత్నాకర్ రెడ్డి, రామడుగు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి పద్మజ తదితరులు పాల్గొన్నారు.



## కోరుటపల్లిలో శ్రీరామ కలశ శోభాయాత్ర

**రామడుగు, ఆగస్టు 14 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి 70వ తిరునక్షత్ర మహోత్సవాలను పురస్కరించుకుని లోకకల్యాణార్థం రామడుగు మండలం కోరుటపల్లి గ్రామంలో శుక్రవారం శ్రీరామ కలశాన్ని తీసుకువచ్చారు. మంగళహారతులు, భజన కార్యక్రమాల నడుమ శ్రీరామ కలశంతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించి శ్రీ హనుమాన్ దేవాలయం వరకు కొనసాగించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, రామడుగు మండల వికాస తరంగిణి బాధ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## మంచిర్యాల మేయర్, డిప్యూటీ మేయర్‌కు శ్రీ పోచమ్మ తల్లి విగ్రహావిష్కరణ ఆహ్వాన పత్రిక అందజేత

**(అరికిల్ల జయకుమార్, ప్రజా తీర్పు, మంచిర్యాల) ఆగష్టు14**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 29వ డివిజన్ వాటర్ ట్యాంక్ ఏరియాలో ఈ నెల 23-08-2026 (ఆదివారం) రోజున అత్యంత వైభవంగా జరగబోయే శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లి విగ్రహావిష్కరణ మహోత్సవ ఆహ్వాన పత్రికలను శుక్రవారం రోజున 29వ డివిజన్ కార్పొరేటర్ బండారి సుధాకర్ ఆధ్వర్యంలో అంద చేశారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్: ధరణి మధుకర్, డిప్యూటీ మేయర్ శ్రీమతి సల్లా రమ్య మహేష్, వీరిని మర్యాదపూర్వకంగా కలసి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను అందజేసి, కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు, అరకాల శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు మరియు వాటర్ ట్యాంక్ ఏరియా కాలనీవాసులు, భక్తులు అదిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆత్మ ఆధ్వర్యంలో చంద్రవెల్లి గ్రామంలో క్షేత్ర ప్రదర్శన

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 14**

వ్యవసాయ శాఖ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి వారి ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి సుద్దాల ప్రేమ్ కుమార్ వరిమొలకలు వెదజల్లి వరి పంట సాగు చేయు విధానం పై రైతులకు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన మరియు క్షేత్రప్రదర్శన నిర్వహించారు ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చంద్రవెల్లి గ్రామ సర్పంచ్ చిలుముల శ్రీనివాస్ పాల్గొన్నారు. రైతులు విత్తనాన్ని మండేకట్టుకొని నేరుగా పొలంలో వెదజల్లుకొనె పద్ధతిని ప్రయోగత్మకంగా చేసి చూపిస్తూ శిక్షణను ఇచ్చారు. నేరుగా వరి విత్తనాన్ని వెదజల్లడం ద్వారా సుమారు 20 నుంచి 35 రోజుల పంట కాలాన్ని తగ్గించుకోవచ్చని వారు తెలిపారు.ఎకరానికి 20 నుండి 30 కేజీ ల విత్తనం అవరమని తెలిపారు. ప్రస్తుత ఎల్ నినో పరిస్థితిలో దృశ్య వరి నారు వేసుకోని రైతులు, 125 రోజుల స్వల్ప కాలిక వరి వంగడాలను ఎన్నుకొని వెదజల్లు పద్ధతి ద్వారా మాత్రమే వరి సాగు చేయాలని సూచించారు. ఈ విధానంలో కలుపు యాజమాన్యాన్ని సమర్థవంతంగా చేపట్టినట్టయితే సాంప్రదాయ పద్ధతులు కి ఏ మాత్రం తక్కువ కాకుండా మంచి దిగుబడి పొందవచ్చును అదేవిధంగా కూలీలకు అయ్యేటువంటి ఖర్చులు కూడా తగ్గించుకోవచ్చు అని సూచించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి వ్యవసాయ విస్తరణ అధికారి చొప్పదండి తిరుపతి,రైతులు మహమ్మద్ రియాజ్, జంగపల్లి లక్ష్మీనారాయణ, ఇతర రైతులు పాల్గొన్నారు

# వీధి వ్యాపారులపై ఊరట, యూజర్ చార్జీలు భారీగా తగ్గింపు

- రోజుకు ?100 నుంచి ?11కి తగ్గిస్తూ జమ్మికుంట మున్సిపల్ కౌన్సిల్ నిర్ణయం.
- ప్రతి చెల్లింపుకూ తప్పనిసరిగా అధికారిక రసీదు.
- మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ మొలుగు దిలీప్ కుమార్.

**జమ్మికుంట, ఆగస్టు 14 ప్రజాతీర్పు**

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని వీధి వ్యాపారుల ఆర్థిక సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ కౌన్సిల్ కీలక నిర్ణయం తీసుకుంది. పట్టణంలో మున్సిపాలిటీ అందిస్తున్న పారిశుద్ధ్య, చెత్త సేకరణ ఇతర ప్రజా సేవలకు సంబంధించి వీధి వ్యాపారులపై ఎలాంటి అనవసరమైన ఆర్థిక భారం పడకుండా యూజర్ చార్జీలను గణనీయంగా తగ్గించినట్లు మున్సిపల్ యంత్రాంగం ప్రకటించింది. ప్రారంభంలో వీధి వ్యాపారుల నుంచి రోజుకు ?100 (నెలకు ?3,000, సంవత్సరానికి ?36,000) చొప్పున యూజర్ చార్జీలు వసూలు చేయాలని ప్రతిపాదించారు. అయితే, నిరుపేద వీధి వ్యాపారుల ఆర్థిక పరిస్థితులను గమనించిన మున్సిపల్ చైర్మన్, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్, శానిటేషన్ సిబ్బంది ప్రత్యేకంగా సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. వ్యాపారులకు ఊరట కలిగిస్తూ యూజర్ చార్జీలను భారీగా తగ్గించాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు.నూతన నిర్ణయం ప్రకారం, ఇకపై రోజుకు కేవలం ?11 చొప్పున (సంవత్సరానికి ?4,800) మాత్రమే యూజర్ చార్జీగా వసూలు చేయనున్నట్లు స్పష్టం చేశారు.యూజర్ చార్జీల వసూళ్ల ప్రక్రియ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని అధికారులు తెలిపారు. వీధి వ్యాపారులు చెల్లించే ప్రతి రూపాయికి మున్సిపాలిటీ తరఫున తప్పనిసరిగా అధికారిక రసీదు అందజేస్తారని, రసీదు ఉంటేనే రుసుము చెల్లించాలని స్పష్టం చేశారు. మున్సిపల్ అభివృద్ధిలో భాగస్వామ్యం అనే నినాదంతో మున్సిపాలిటీ ముందుకు సాగుతోంది. వీధి వ్యాపారులు మున్సిపల్ సేవలకు సహకరిస్తూ, నిర్ణయించిన నూతన రుసుములను చెల్లించి, తమ వ్యాపార ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ప్రజలు, వ్యాపారులు, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో జమ్మికుంటను సుందరమైన, పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి అని తెలిపారు.







## ఆగస్టు 31న నిజామాబాద్‌లో పాంచజన్య సంకల్ప సభ

- ఘనంగా పోస్టర్ ఆవిష్కరణ..
- భారీ జనసమీకరణకు పార్టీ శ్రేణుల పిలుపు

**కోరుట్ల ఆగస్టు 14 (ప్రజాతీర్పు)**

తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో ఆగస్టు 31న నిజామాబాద్ జిల్లాలో నిర్వహించనున్న పాంచజన్య సంకల్ప సభకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి, కోరుట్ల ఇన్‌చార్జి డాక్టర్ రఘు, రాష్ట్ర నాయకులు నవీన్ చారి, పార్లమెంట్ ఇన్‌చార్జి అలీం భాయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ.. పార్టీ ఏర్పాటు అనంతరం తొలిసారిగా కల్వకుంట్ల కవిత తన సొంత జిల్లా నిజామాబాద్‌కు వస్తున్న నేపథ్యంలో ఆమెకు ఘన స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాంచజన్య సంకల్ప సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకులు నవీన్ చారి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కవిత కీలకంగా పాల్గొన్నారని తెలిపారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, మహిళలకు రిజర్వేషన్లు, బీసీలకు న్యాయమైన ప్రాతినిధ్యం, అణగారిన వర్గాల హక్కులు, ఉచిత విద్య, ఉచిత వైద్యం వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే సభ ఉద్దేశమన్నారు. పార్లమెంట్ ఇన్‌చార్జి అలీం భాయ్ మాట్లాడుతూ.. మైనార్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పార్టీ ముందుకు సాగుతోందన్నారు. ఆగస్టు 31న జరిగే పాంచజన్య సంకల్ప సభను భారీ జనసమీకరణతో విజయవంతం చేస్తామని పార్టీ నాయకులు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో అజార్ భాయ్, చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, లింగంపల్లి సంజీవ్, అడ్డగట్ల సంతోష్ పాల్గొన్నారు.



## మాదక ద్రవ్యాల నిర్మూలనకు అందరి సహకారం అవసరం

- అడిషనల్ డిసిపీ వెంకటరమణ

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) ఆగస్టు 14)**

కిమ్స్ కాలేజీలో పోలీస్ ఈగల్ టీం ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమశాఖ తరపున పాల్గొని నషా ముక్త్ భారత్ అభియాన్ ద్వారా మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల గురించి విద్యార్థులకు వివరించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతుందని, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి సహకారం అవసరమని కోరారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు ప్రజలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఈగల్ టీం డీఎస్పీ ఉపేందర్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్, కిమ్స్ కాలేజ్ వైస్ చైర్మన్ సాకేత్ రామారావు, మిషన్ వాత్సల్య సిబ్బంది సాదినేని రమేష్, స్వప్న, త్రీ టౌన్ సీఐ తిరుమల్ పాల్గొన్నారు.




## మోదీ పాలనకు చరమగీతం పాడాలి

- జగిత్యాల జిల్లా కేంద్రంలో ముగిసిన సిపిఐ పాదయాత్ర
- భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు
- సిపిఐ రాష్ట్ర కారదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగస్టు 14.**

మోడీ పాలనకు చరమగీతం పాడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. బద్లావ్ జరూరీ హై మార్పు కావాలి అని కోరుతూ జగిత్యాల జిల్లా సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో చివరి రోజు శుక్రవారం సిపిఐ నాయకులు పాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త బస్టాండ్, తహసీల్ చౌరస్తాల మీదుగా పాత బస్టాండ్ వరకు జీబు జాత ర్యాలీ చేపట్టి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేఖ విధానాలపై ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రోడ్ షోలో చాడ వెంకట్ రెడ్డి పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కార్పోరేట్ సంస్థలకు కేంద్రం కొమ్ముకాస్తు సామాన్యుల పాలిట గుది బండగా మారిందని మండిపడ్డారు. గత 12 సంవత్సరాల పాలనలో దేశాన్ని అప్పుల మయంగా చేసిన ఘనత ప్రధాని మోదీకే దక్కుందన్నారు. ధరల పెరుగుదలను అరికట్టడడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఉద్యోగ అవకాశాలు పూర్తి స్థాయిలో కల్పించకపోవడం తో నిరుద్యోగుల పరిస్థితి అచమ్యగోచరంగా తయారైందన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలపై సీపీఐ ఈ నెల 6 నుండి 14 వరకు దేశ వ్యాప్త పాదయాత్రలు, జీబు జాతలు చేపట్టిందన్నారు. ఈ ఆత్మవిశ్వాసంతోనే సెప్టెంబరు 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో బద్లావ్ జరూరీ పేరుతో లక్షలాది మంది కార్యకర్తలతో నిరసన ర్యాలీ చేపట్టనున్న వివరించారు. మార్పు కోసం చలో ఢిల్లీ కార్యాక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, రాజన్న సిరిసిల్లా జిల్లాల సీపీఐ జిల్లా కార్యదర్శులు చెన్న విశ్వనాథం, మంద సుదర్శన్, నాయకులు రాములు, మహేష్, సురేష్, భూమేశ్వర్ , హన్మంతు తదితరులు ఉన్నారు.

# 500 మీటర్ల జాతీయ జెండాతో తాండూరులో ఘనంగా తిరంగా యాత్ర

- దేశభక్తి నినాదాలతో మార్మోగిన తాండూరు.. 300 మందికి పైగా విద్యార్థులతో ఉత్సాహంగా తిరంగా ర్యాలీ

**(రాంపెల్లి చంద్రశేఖర్ ప్రజా తీర్పు తాండూర్ మండలం రిపోర్టర్)**



తాండూరు, ఆగస్టు 14: జాతీయ జెండా కేవలం ఒక వస్త్రం కాదని, అది భారతదేశ ఆత్మగౌరవానికి ప్రతీకగా, అమరవీరుల త్యాగాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు తాండూరు మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు దూడపాక భరత్ ఆధ్వర్యంలో 500 మీటర్ల భారీ జాతీయ జెండాతో ఘనంగా తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా కార్యదర్శి, తాండూరు మండల ఇన్‌చార్జి, తిరంగా ర్యాలీ ఇన్‌చార్జి రాచర్ల సంతోష్ కుమార్ హాజరయ్యారు. మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఎమాజీ పాల్గొని యాత్రకు ఉత్సాహాన్ని అందించారు. స్థానిక యూనియన్ బ్యాంక్ అండర్ బ్రిడ్జి నుంచి ప్రారంభమైన తిరంగా యాత్ర ఐబీ ప్రధాన కూడలి అండర్ బ్రిడ్జి మీదుగా కొనసాగింది. 500 మీటర్ల భారీ జాతీయ జెండాతో సాగిన యాత్రలో దేశభక్తి నినాదాలు మార్మోగాయి. జాతీయ జెండాల రెపరెపలు, విద్యార్థులు, బీజేపీ కార్యకర్తల నినాదాలతో తాండూరులో దేశభక్తి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశభక్తి కేవలం మాటల్లో కాకుండా దేశం పట్ల మన బాధ్యతలో కనిపించాలని అన్నారు. "దేశం మనకు ఏమిచ్చిందని ప్రశ్నించే ముందు.. దేశానికి మనం ఏమిచ్చామో ప్రతి ఒక్కరూ ఆలోచించాలి" అని పిలుపునిచ్చారు. కులం, మతం, ప్రాంతం ఏదైనా కావచ్చు.. ప్రతి ఒక్కరి మొదటి గుర్తింపు భారతీయుడేనని, దేశం ఒక్కటే, జెండా ఒక్కటే, మన గమ్యం ఒక్కటేనని పేర్కొన్నారు. ప్రతి భారతీయుడు తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ ఐక్యత, సమగ్రతను చాటాలని కోరారు. జాతీయ జెండా కేవలం ఇంటిపై మాత్రమే కాకుండా ప్రతి భారతీయుడి గుండెల్లో దేశభక్తిని ప్రతిబింబించాలని ఆకాంక్షించారు.

### 300 మందికి పైగా విద్యార్థులతో ఉరకలేసిన దేశభక్తి

తిరంగా యాత్రలో స్థానిక విద్యా భారతి, సెయింట్ థెరిస్సా పాఠశాలలకు చెందిన 300 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారుల చేతుల్లో జాతీయ జెండాలు, నోట దేశభక్తి నినాదాలతో యాత్ర సందడిగా సాగింది. విద్యా భారతి పాఠశాల విద్యార్థుల బ్యాండ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసుల సమర్థవంతమైన విధులు తిరంగా యాత్ర సందర్భంగా తాండూరు ఎస్‌ఐ ప్రసాదరావు స్వయంగా పాల్గొని పోలీసు సిబ్బందితో కలిసి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. భారీ జాతీయ జెండాతో యాత్ర కొనసాగుతున్న సమయంలో ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. యాత్ర మార్గంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ కార్యక్రమం ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా జరిగేలా ఎస్‌ఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించారు. పోలీసుల సహకారంతో తిరంగా యాత్ర ప్రశాంతంగా, క్రమశిక్షణతో కొనసాగింది.

### "దేశభక్తి ఒక్కరోజు నినాదం కాదు.. జీవితాంతం పాటించాల్సిన బాధ్యత"

దేశ ఐక్యతను బలపరిచే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాయకులు కోరారు. జాతీయ పండుగలు, ప్రత్యేక కార్యక్రమాలకే దేశభక్తిని పరిమితం చేయకుండా ప్రతిరోజూ దేశం పట్ల బాధ్యత, సమాజం పట్ల సేవాభావం, జాతీయ జెండా పట్ల గౌరవం ప్రతి పౌరుడి జీవితంలో ప్రతిబింబించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రామగౌని మహీధర్ గౌడ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, సీనియర్ నాయకులు పులగం తిరుపతి, బొల్లెడ్ల కేశవరెడ్డి, యంగర్ తుకారాం, జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్ధం మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, ఎస్సీ మోర్చా సీనియర్ నాయకులు పాగిడి చిరంజీవి, నర్సింగ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్, మండల నాయకులు, జాతీయవాదులు అభినవ సంతోష్ కుమార్, గాదె రాజేశం, చొక్కాల నాగభూషణ్, ఏముర్ల ప్రవీణ్, తిరుపతి, గుజ్జేటి శేఖర్, ప్రభాకర్, అద్వాల సతీష్, ఎలిగేటి నరేష్, ఆనంద్, కామెర మహేష్, శ్రావణ్ తదితరులతో పాటు విద్యా భారతి పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సెయింట్ థెరిస్సా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## మైనార్టీ గురుకుల బాలుర విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ వితరణ

- దాతలను అభినందించిన ప్రిన్సిపాల్ చంద్రమోహన్

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) ఆగస్టు 14**

ప్రభుత్వ గురుకులాలను బలోపేతం చేయాలనే సదుద్దేశంతో, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్టీల్ వాటర్ బాటిల్స్ ను, అదే కళాశాలలో హిందీ టిజిటిగా పనిచేస్తున్న భవానీ సింగ్ అతడి సోదరుడు ఉదార హృదయంతో పంపిణీ చేయడం అభినందనీయమని ప్రిన్సిపాల్ పోరండ్ల చంద్రమోహన్ అన్నారు. విద్యార్థులకు అండగా నిలవాలని సంకల్పంతో ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగాన్ని నివారించి, ప్రతి విద్యార్థికి ఒక స్టెయిన్‌లెస్ స్టీల్ వాటర్ బాటిల్ అందించాలనే నా ప్రయత్నం చాలా రోజులుగా కొనసాగుతోంది. నాప్రయత్నానికి స్పందించి, మా పాఠశాలలో పనిచేస్తున్న హిందీ టీచర్ భవానీ సింగ్, అతడి సోదరుడు కలిసి మగ్ధూమ్ పూర్ లోని మైనారిటీ గురుకుల బాలుర-3 ఒకేషనల్ కళాశాలలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చి విద్యను అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థికి సుమారు 433 స్టెయిన్‌లెస్ స్టీల్ వాటర్ బాటిళ్లను, మొత్తం రూ. 51,970/- విలువతో అందించడం స్ఫూర్తిదాయకమన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ పట్ల వారు చూపించిన శ్రద్ధ సేవాభావానికి నిదర్శనం అన్నారు. కళాశాల యాజమాన్యం తరపున, విద్యార్థుల తరపున, దాతలు భవానీ సింగ్ కు, అతడి సోదరునికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు .



## డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ ను పరామర్శించిన బి ఆర్ పి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బుర్రి సాగర్

**నర్సంపేట టౌన్ ఆగస్టు 14 ప్రజా తీర్పు**

బహుజన ఉద్యమ నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ ను బహుజన్ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బుర్రి సాగర్ పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. గత 30 సంవత్సరాలుగా నర్సంపేట నియోజకవర్గంలో మలిదశ తెలంగాణ ఉద్యమం, బీసీ ఉద్యమం, బహుజన ఉద్యమంలో అనునిత్యం పోరాడే నాయకుడు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ అని అన్నారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో జరిగిన బీసీ మహాసభ ల కార్యక్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోవడంతో శ్రీనివాస్ కు తలకు మరియు కాలుకు గాయాలు కావడం జరిగిందని ఇలా జరగడం చాలా బాధాకరం అని అన్నారు. ఏది ఏమైనా డ్యాగల శ్రీనివాస్ తొందరగా కోలుకుని మళ్లీ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన్ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తనుగుల శ్రీకాంత్, బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా యూత్ అధ్యక్షుడు కదారి సురేష్ యాదవ్, బీసీ సంఘం జిల్లా కార్యదర్శి కానుగుల కుమారస్వామి, జినుకల యాకయ్య ముదిరాజ్, తనుగుల సుధాకర్, మారపెల్లి రాజు, గొర్రె రాములు తదితరులు పాల్గొన్నారు.



## సొంత నిధులతో పల్లె దవఖానరూపురేఖలు మార్చిన సీహెచ్ఓ శ్రావణ్

- వైద్యం మాత్రమే కాదు మౌలిక వసతుల్లోనూ ఆదర్శం 'డాక్టర్ కాదతడు నడిచే దేవుడు' అంటున్న ప్రజలు

**నర్సంపేట రూరల్,ఆగస్టు 14, ప్రజా తీర్పు ప్రతినిధి:**

?నర్సంపేట ద్వారకాపేట్ పల్లె దావఖాన ప్రభుత్వ వైద్యం అంటే కొందరిలో ఉన్న పాత భావజాలాన్ని చెరిపేస్తూ, పల్లె దవఖానను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సి హెచ్ ఓ.శ్రావణ్. ప్రభుత్వం కల్పించే వసతుల కంటే అదనంగా తన సొంత డబ్బులతో రోగులకు అవసరమైన సదుపాయాలను సమకూర్చి ప్రజాదరణ పొందుతున్నారు.నిత్యం ప్రజల మధ్యే ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న శ్రావణ్ చొరవపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన కేవలం వైద్యుడు మాత్రమే కాదు, మా గ్రామానికి వచ్చిన దేవుడు" నిగ్రామస్థులుమురిసిపోతున్నారు. ఇలాంటి సేవానిరతి కలిగిన అధికారి తమ పల్లె దావాఖానాలో ఉండటం తమ అదృష్టమని కొనియాడుతున్నారు.

## ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట)ఆగస్టు14**



ఆరేపల్లి గ్రామానికి చెందిన మరిజ సంకీర్తన వయసు 27 సంవత్సరాలు అను వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోగా సంఘటన స్థలానికి సిరిసిల్ల డిఎస్పి నాగేంద్రచారి,ఇల్లంతకుంట ఎస్ఐ సిరిసిల్ల అశోక్ మరియు తహసీల్దార్ సురేష్ చేరుకొని మృతురాలు తండ్రి మరిజ యాదన్ రావు తెలిపిన వివరాల ప్రకారం తన కూతురును బెజ్జంకి గ్రామానికి చెందిన సోమని రమేష్ అను వ్యక్తిని ఐదు సంవత్సరాల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడని రమేష్ కరీంనగర్ లో ఆటో నడుపుతూ ఉండేవాడు, భర్త రమేష్ అత్త లచ్చవ్వ మామ నరసయ్య, మరదలు శివ మరియు ప్రవీణ్ లు తన కూతురు సంకీర్తనను వరకట్నం తీసుకురమ్మని శారీరకంగా మరియు మానసికంగా వేధింపులకు గురి చేసే వారని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శవ పంచనామాను తహసీల్దార్ సురేష్ నిర్వహించగా కేసు నమోదు చేసుకోవడం జరిగిందని,ఎస్ ఐ సిరిసిల్ల అశోక్ అన్నారు,ఈ కేసు సిరిసిల్ల డిఎస్పి కె నాగేంద్ర చారి ఆధ్వర్యంలో విచారణ జరుగుతుందని తెలియజేసారు



## 22వ వార్డులో శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గమ్మ బోనాల వేడుకలలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్- పెండం లక్ష్మీ రామానంద్

**నర్సంపేట టౌన్ ఆగస్టు 14 ప్రజా తీర్పు**

నర్సంపేట పట్టణంలోని 22వ వార్డులో కనకదుర్గమ్మ అమ్మవారి బోనాల జాతర స్థానిక కౌన్సిలర్ బాణాల ప్రసన్న శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగినది ఈ యొక్క బోనాల వేడుకలలో నర్సంపేట మున్సిపాలిటీ చైర్ పర్సన్ శ్రీ పెండెం లక్ష్మీ రామానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భాన్ని పురస్కరించుకొని చైర్పర్సన్ మాట్లాడుతూ చిలువేరు వంశ ఇలా వేల్పు అయినా శ్రీశ్రీశ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి బోనాల జాతర నిర్వహించడం చాలా సంతోషకరమని ఇలా ప్రతి సంవత్సరం అమ్మవారిని స్థానిక ప్రజలు కొలిచి కొంగుబంగారంగా భావించాలని అలాగే నర్సంపేట పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకోవడం జరిగినది కనకదుర్గమ్మ అమ్మవారి బోనాల వేడుకలు ఇదివరకు ఎప్పుడు చేయనంత ఘనంగా నిర్వహించడం చాలా సంతోషకరమని ఈ ప్రాంత ప్రజలకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహాయ సహకారాలతో అభివృద్ధి చేస్తామని మొట్టమొదటగా నర్సంపేటలో వెలసిన కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయం అభివృద్ధి పరచుటలో తమ వంతు కృషి చేస్తామని తెలియజేసినారు. ఈ వేడుకలలో చిలువేరి వంశస్థులు చిలువేరు రజిని భారతి రమేష్ దంపతులు, చిలువేరు సాయి శ్రీనివాస్ దంపతులు చిలువేరు వంశస్తులందరూ పాల్గొన్నారు కనకదుర్గమ్మ కాలనీ ప్రముఖులు గండి గిరి, జనగాం వీర కుమార్,తాళ్ల పెల్లి శ్రీనివాస్ బలగాని వీరన్న, కోదండరామ ట్రేడర్స్ శ్రీకాంత్, నాగెల్లి రాజు, అనిల్ మహేంద్ర, రామగిరి రాజు గాధగోని కుమార్, సుంకర నేని నరసయ్య కొయ్యేడి కిరణ్ కుమార్, కక్కర్ల శ్రీధర్, గండి విజయ్ కుమార్, తూముల అశోక్, పాలడుగుల సాంబయ్యయువజన నాయకులు ఎస్ కే యూసుఫ్, బేరి బన్ను, మార్త సన్నీ, పాలడుగుల బబ్బులు, రామగిరి త్రిలేష్ తదితరులు పాల్గొన్నారు. బాణాల ప్రసన్న శ్రీనివాస్. 22వ వార్డు కౌన్సిలర్ నర్సంపేట.

## మాదాపూర్ డివిజన్ ఎంఆర్పీఎస్ అధ్యక్షుడిగా ఎలిమెల ప్రశాంత్ నియామకం...

**శేరిలింగంపల్లి, ఆగస్టు 14 (ప్రజా తీర్పు)**



మాదాపూర్ : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎంఆర్పీఎస్ నుండి శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడి గా ఎలిమెల ప్రశాంత్ ను నియమిస్తూ ఎంఆర్పీఎస్ జాతీయ నాయకత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఎలిమెల ప్రశాంత్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన జాతీయ అధ్యక్షులు మేడి పాపన్న , రాష్ట్ర అధ్యక్షులు మోహన్, రాష్ట్ర కార్యదర్శి యాదయ్య లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా మాదాపూర్ డివిజన్‌లో ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తానని, పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ నియామకంపై సంతోషం వ్యక్తం చేసిన ఎంఆర్పీఎస్ జాతీయ అధ్యక్షులు పాపన్న, రాష్ట్ర అధ్యక్షులు మోహన్, రాష్ట్ర కార్యదర్శి బాచుపల్లి యాదయ్య లు ప్రశాంత్ కు శుభాకాంక్షలు తెలిపారు. యువతను కలుపుకొని ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎం ఆర్ పీ ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బెల్లంపల్లి || టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంచిర్యాల డీసీపీ

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 14**

రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని బెల్లంపల్లి ×× టౌన్ పోలీస్ స్టేషన్‌ను మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్ పనితీరు,నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందుతున్న పోలీస్ సేవలను నిరంతరం పర్యవేక్షించడంలో భాగంగా డీసీపీ ఈ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతను పాటించాలని సూచించారు.వివిధ నేరాల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను క్రమబద్ధంగా ఉంచాలని ఎస్ఐ తిరుపతికి ఆదేశించారు.రిసెప్షన్ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను,పరిశీలించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించి,వారి సమస్యలను చట్టపరంగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించి,పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు,వివిధ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఎస్ఐ, స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి కేసుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు,చేయడం,రికార్డులను సక్రమంగా అప్‌లోడ్ చేయడం వంటి అంశాలపై ఆరా తీశారు. ఈ తనిఖీలో బెల్లంపల్లి రూరల్ సీఐ హనూక్ కూడా పాల్గొన్నారు.

# రైతులతో మాట - పంట మార్పిడికి బాట

- జిల్లాలో పంట మార్పిడికార్యక్రమాన్ని మరింత ముమ్మరం చేయాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) ఆగస్టు 14**



ప్రస్తుత వర్షపాత పరిస్థితులు, రాబోయే రోజులకు సంబంధించిన వాతావరణ అంచనాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో చేపట్టిన "రైతులతో మాట -- పంట మార్పిడికి బాట" ప్రత్యేక కార్యక్రమాన్ని మరింత ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో రాష్ట్రంలోని వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితి, పంటల సాగు మరియు పంట మార్పిడి పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. రాబోయే వారాల్లో, ముఖ్యంగా సెప్టెంబర్ నెలలో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో వ్యవసాయ, సాగునీటి వినియోగంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో సాగునీటి భరోసా లేని ప్రాంతాల్లో కొత్తగా వరి సాగు చేపట్టే విషయంలో రైతులు జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఒకటి రెండు రోజుల వర్షాలను మాత్రమే పరిగణనలోకి తీసుకోకుండా, పంట పూర్తయ్యే వరకు అవసరమైన నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటను ఎంపిక చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికే "రైతులతో మాట -- పంట మార్పిడికి బాట" పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఇంకా విత్తనాలు వేయని రైతులను గుర్తించి, వ్యవసాయ శాఖ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది నేరుగా రైతుల వద్దకు వెళ్లి వారితో మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. స్థానిక నేల స్వభావం, వర్షపాతం, భూగర్భ జలాల లభ్యత, పంట కాలపరిమితి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని రైతులకు అనువైన ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ అధికారులు సలహాలు అందించాలని ఆదేశించారు. సాగునీటి భరోసా లేని ప్రాంతాల్లో పరిస్థితులకు అనుగుణంగా కంది, మినుము, పెసర, మొక్కజొన్న, వేరుశనగ, కూరగాయలు మరియు ఇతర తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను వ్యవసాయ, ఉద్యానవన శాఖల సాంకేతిక సలహా మేరకు చేపట్టాలని రైతులకు సూచించారు. రాబోయే 7 నుంచి 10 రోజులు అత్యంత కీలకమైనవని కలెక్టర్ పేర్కొన్నారు. ఇంకా సాగు చేపట్టని విస్తీర్ణం ఎక్కువగా ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వర్షాల కోసం ఎదురుచూస్తున్న ప్రతి రైతును అధికారులు వ్యక్తిగతంగా కలిసి పంట ఎంపికపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడానికి ముందుకు వచ్చే రైతులకు అవసరమైన విత్తనాల లభ్యతతో పాటు సాంకేతిక సహకారం అందించేందుకు వ్యవసాయ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. "రైతు ప్రయోజనమే మన ప్రధాన లక్ష్యం. ప్రస్తుతం ఎంత నీరు ఉందన్నది మాత్రమే కాకుండా, పంట పూర్తయ్యే వరకు ఎంత నీరు అందుబాటులో ఉంటుందో అంచనా వేసుకొని పంటను ఎంచుకోవాలి. సాగునీటి భరోసా లేని ప్రాంతాల్లో తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను చేపట్టాలి. రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిగా అండగా ఉంటుంది" అని జిల్లా కలెక్టర్ తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామాల వారీగా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ఇంకా సాగు ప్రారంభించని ప్రతి రైతుకు సరైన పంట సలహా అందేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని రైతులు "రైతులతో మాట -- పంట మార్పిడికి బాట" కార్యక్రమానికి సహకరించి, ప్రస్తుత వర్షపాతం మరియు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ అధికారుల సలహాతో సరైన పంటలను ఎంపిక చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టానికి తూట్లు.. 133రోజులు దాటినా స్పందించని అధికారులు

- బాధిత పౌరుడికి చుక్కలు చూపిస్తున్న 'భానో జీపేట' గ్రామపంచాయతీ అధికారులు
- ఒకరిపైఒకరునెట్టేసుకుంటున్న ఎంపీ ఓ ఎంపీడీవో
- షోకాజ్ మెమోలకే పరిమితమైన చర్యలు
- పట్టించుకోని డిపిఓ జెడ్ పి సి ఈ ఓలి



**నర్సంపేట రూరల్, ఆగస్టు 14, ప్రజా తీర్పు ప్రతినిధి:**

సమాచార హక్కు చట్టం ప్రకారం అడిగిన వివరాలు ఇచ్చేందుకు స్థానిక అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. భానోజీపేట గ్రామానికి చెందిన భూషబోయిన ప్రవీణ్ అనే వ్యక్తి గ్రామపంచాయతీ పరిధిలోని పలు అభివృద్ధి పనులు, నిధుల వ్యయంపై సమాచారం కోరుతూ ఆర్.టి.ఐదరఖాస్తు చేసుకున్నారు. అయితే, దరఖాస్తు చేసుకుని ఏకంగా 133రోజులు గడిచినా అధికారులు నేటికీ ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ?ఒకరిపై ఒకరు సాకులు.. తీరు మారని యంత్రాంగం! ?బాధితుడు సమాచారం కోసం స్థానిక (మండల పరిషత్ ఆఫీసర్) ని నిలదీయగా.. "నాకు ఈ విషయంతో ఎలాంటి సంబంధం లేదు, సమాచార సూపరింటెండెంట్ లేదా ఎంపీడీవోనే అడగండి" అంటూ సమాధానం దాటవేశారు. దీంతో బాధితుడు ఎంపీడీవో ని ఆశ్రయించగా, ఆయన స్పందించి బాధిత వ్యక్తిని తీసుకొచ్చి సమాచారాన్ని చూపించాలని ఎం పి ఓ కి సూచించారు. అయినప్పటికీ, ఎంపీ ఓమాత్రం ఎంపీడీవో మాటలను కూడా ఖాతరు చేయకుండా "నాకేం సంబంధం లేదు" అని మొండిగా వ్యవహరిస్తుండటం గమనార్హం.

**షోకాజ్ మెమోలతోనే సరిపెడతారా?**

సమాచారం ఇవ్వాల్సిన గడువు ఎప్పుడో ముగిసినప్పటికీ, అధికారుల మధ్య సమన్వయ లోపం మరియు నిర్లక్ష్యం బాధితుడికి నరకం చూపిస్తున్నాయి. ఉన్నతాధికారులు కేవలం షోకాజ్ మెమోలతో కాలయాపన చేస్తున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో బాధితుడికి న్యాయం చేయడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. డిపిఓ (జిల్లా పంచాయతీ అధికారి) మరియు జెడ్ సి ఈ ఓ లు ఈ వ్యవహారంపై తక్షణమే జోక్యం చేసుకుని, సమాచారం దాచేస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. "ప్రజా పాలన అని పేరు గొప్పగా చెప్పుకోవడం కాదు.. సామాన్యుడికి న్యాయం జరిగినప్పుడే ఆ పాలనకు అర్థం ఉంటుంది. ఆర్.టి.ఐ చట్టాన్ని హేళన చేస్తున్న అధికారులపై తక్షణమే విచారణ జరిపి సమాచారం ఇప్పించాలి."ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు డిపిఓ జెడ్ పి సి ఈఓ స్పందించి, బాధితుడికి సమాచారం ఇప్పించడంతో పాటు, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



## మోకా పంచనామా రిపోర్టు ఇవ్వడం లేదు.. తాసిల్దార్ పై సర్పంచ్ ఆరోపణ

**మంథని, ఆగస్టు 14 (ప్రజాతీర్పు)**

మంథని మండలంలోని గాజులపల్లి గ్రామపంచాయితీ పరిధిలోని గుమ్మునూర్ శివారులో రోడ్డును కొందరు ఆక్రమించుకుంటున్నారని, వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని గాజులపల్లి సర్పంచ్ కారింగుల సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, గాజులపల్లి గ్రామానికి చెందిన గుమ్మునూర్ శివారు సర్వే నెం. 209 ఉన్న భూమిలో గత 100 సంవత్సరాలుగా రోడ్డు ఉందని తెలిపారు. రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా చెట్లు నాటడం జరిగిందని చెప్పారు. అయితే గాజులపల్లి గ్రామానికి చెందిన సకినాల శ్రీనివాస్ ఆ స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయంపై మంథని తాసిల్దార్ కు ఫిర్యాదు చేసిన అనంతరం సర్వేర్, ఆర్ఐ, జిపిఓ, సర్పంచ్ సంయుక్తంగా మూడు రోజులక్రితం పంచనామా చేసినప్పటికీ ఈ మొఖా పంచనామ రిపోర్టు ఇవ్వనని తాసిల్దార్ పేర్కొకుంటున్నాడని ఆయన అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి మోకా పంచనామా రిపోర్టును తాసిల్దార్ ద్వారా తక్షణం ఇప్పించాలని, రోడ్డును ఆక్రమించుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సుధాకర్ కోరారు. లేనిపక్షంలో గ్రామస్థులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



## సుందరగిరిలో బీభత్సం సృష్టించిన దొంగలు

- రెండు ఇళ్లలో నగదు, బంగారం,వెండి. భారీ చోరీ
- మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఎస్సై జగదీశ్వర్

**హుస్నాబాద్ ఆగస్టు 14 రవీందర్ ప్రజా తీర్పు**

రెండు ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని బీభత్సం సృష్టించి, తాళాలు పగులగొట్టి నగదు, బంగారం, వెండి వస్తువులతో ఉడాయించిన ఘటన కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం... ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం నుండి 14వ తేదీ అందాజా మూడు గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఈ చోరీలకు పాల్పడినట్లు జరిగిన సంఘటనను బట్టి తెలుస్తోంది. గ్రామానికి చెందిన దేవులపల్లి జ్యోతి (55) ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన దుండగులు తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాను తెరిచి అందులో ఉన్న రూ.50,000 నగదు, తులం బంగారు ఆభరణాలు, రెండు అల్యూమినియం సామాన్లు ఎత్తుకెళ్లారు. మొత్తం నష్టం రూ.81,000 వరకు ఉంటుందని బాధితురాలు తెలిపింది. అదే విధంగా అదే గ్రామానికి చెందిన శ్రీమూర్తి వెంకటముత్యం ఇంట్లోనూ దొంగలు చొరబడి సుమారు 90 తులాల వెండి వస్తువులతో పాటు రూ.15,000 నగదును దోచుకెళ్లారు. ఈ రెండు ఘటనలపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు వేగవంతం చేసినట్లు పోలీసులు తెలిపారు. క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలు సేకరిస్తున్నామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని వెల్లడించారు.

**మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ జగదీశ్వర్**

ఈ వరుస చోరీల నేపథ్యంలో పోలీసులు ప్రజలను అప్రమత్తం చేశారు. ఊళ్లకు వెళ్లేవారు ఇళ్లకు నాణ్యమైన తాళాలు వేసుకోవాలని, విలువైన బంగారు, వెండి ఆభరణాలు మరియు నగదును ఇంట్లో ఉంచకుండా సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకోవాలని ఎస్ఐ జగదీశ్వర్ సూచించారు. ప్రయాణాల సమయంలో నమ్మకమైన పొరుగువారికి సమాచారం ఇవ్వాలని, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. రాత్రివేళల్లో ఇంటి పరిసరాల్లో వెలుతురు ఉండేలా చూసుకోవాలని, గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఒకవేళ చోరీ జరిగినట్లు గమనిస్తే సాక్ష్యాలు దెబ్బతినకుండా ఇంట్లోని వస్తువులను తాకకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని ఎస్ఐ ప్రజలకు చెప్పారు.

## పరిమితికి మించిన పురుగు మందుల అవశేషాల్లో

భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ నిర్దేశించిన పురుగుమందుల అవశేషాల పరిమితిని మించిన పండ్లు, కూరగాయల నమూనాలు దేశంలో అత్యధికంగా తెలంగాణలో నమోదయ్యాయి. ఇక్కడ 8,198 నమూనాలలో 486 నమూనాల్లో అనుమతించదగిన స్థాయికంటే ఎక్కువగా అవశేషాలు ఉన్నట్లు తేలింది. ఆంధ్రప్రదేశ్‌లో 2,104 నామూనలకు గాను 134 పరిమితిని మించాయి. 2023-2026 మధ్యకాలానికి సంబంధించి నమోదైన వివరాలను లోక్‌సభలో వెల్లడించారు. కర్ణాటకలో 9,176 నమూనాల్లో 334 నమూనాలు (3.6 శాతం) ఈ పరిమితిని మించి రెండవ స్థానంలో నిలిచాయి. మహారాష్ట్రలో పరీక్షించిన 5,298 నమూనాల్లో 260(4.9 శాతం) పరిమితికి మించాయి.



## దొంగతనం కేసులో నిందితుడు అరెస్ట్

- రూ. 40 వేల నగదు, ఆటో స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ శ్రీధర్

**హుస్నాబాద్ ఆగస్టు 14 రవీందర్ ప్రజా తీర్పు**

దొంగతనం కేసులో నగదును దొంగిలించి పారిపోయిన నేరస్తున్ని పట్టుకున్నట్లు హుస్నాబాద్ సీఐ శ్రీధర్ వెల్లడించారు. సీఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 5న మధ్యాహ్నం సమయంలో మండలంలోని మహమ్మదాపూర్ గ్రామానికి చెందిన సున్నం రవీందర్ రెడ్డి ఇంటి పైకప్పు సిమెంట్ రేకులను పగలగొట్టి, ఇంట్లోకి ప్రవేశించి, బీరువాలో ఉన్న రూ. 40 వేల నగదును మహమ్మదాపూర్ గ్రామానికి చెందిన కాసాని నాగరాజు దొంగిలించి పారిపోయాడని చెప్పారు. ఈ కేసులో నిందితుడుగా ఉన్న నాగరాజు ను దొంగిలించింది అతడే అని నిర్ధారించుకొని శుక్రవారం మహమ్మదాపూర్ లో పట్టుకోవడం జరిగిందన్నారు. ఇతని వద్ద నుండి రూ. 40 వేల నగదు, ఆటోను స్వాధీనం చేసుకుని నిందితున్ని న్యాయస్థానం లో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. అయితే నేరస్థున్ని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన ఎస్సై లక్ష్మారెడ్డి ని, కానిస్టేబుల్ సంజీవ్ ను సీఐ శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు.



## మైనారిటీ కోఆప్షన్ సభ్యురాలిగా గ్లోరినా ఏకగ్రీవ ఎన్నిక

**హుస్నాబాద్ ఆగస్టు 14 రవీందర్ ప్రజా తీర్పు**

హుస్నాబాద్ మున్సిపల్ మైనారిటీ కోఆప్షన్ (క్రిస్టియన్) సభ్యురాలిగా కాతా అలియాస్ మారుపాక గ్లోరినా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ దండి లక్ష్మి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 14 మంది కాంగ్రెస్ కౌన్సిలర్ల మద్దతుతో గ్లోరినా ఎన్నికైనట్లు మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్ ప్రకటించారు. గత మే నెలలో నలుగురు కోఆప్షన్ సభ్యులకుగాను ముగ్గురిని ఎన్నుకోగా, మైనారిటీ కోఆప్షన్ సభ్యుడి ఎన్నిక వాయిదా పడింది. దీంతో కౌన్సిలర్ల ఏకాభిప్రాయంతో శుక్రవారం గ్లోరినాను ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ రవీందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డేపల్లి వెంకటరమణకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మైనారిటీల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు చెన్నబోయిన అనూష, బూరుగులత, పిల్లి తిరుపతి, బొలిశెట్టి రాజు, భూక్య సంపత్ నాయక్, గడిపే సతీష్‌కుమార్, సావుల మంజుల, పూదరి వరప్రసాద్, కేశవేణి రమేష్, బొల్లి శ్రీనివాస్, వైద్యం కిరణ్ ప్రసాద్, గాదెపాక రవీందర్, వాల సుప్రజ, బత్తుల స్వరూప, కోఆప్షన్ సభ్యులు ఎండీ హసన్, భూక్య సరోజన, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గా వూట్కూరి రమణా రెడ్డి

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట )ఆగస్టు14**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్ )చెర్మన్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి స్థానిక ఎంఎల్ఏ కవ్వంపెల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలకవర్గం చైర్మన్ గా ఉట్కూరి రమణా రెడ్డి, వైస్ చెర్మన్ గా యాస తిరుపతి ప్రమాణస్వీకారం చేయగా డైరెక్టర్లు గా సొల్లు కవిత,సింగరెడ్డి లక్ష్మి,కోనేటి సమ్మయ్య, గుండా వెంకటేశం ఎలుక అనిల్ కుమార్, ఉప్పుల సంజీవరెడ్డి, కేతిరెడ్డి నవీన్,ముక్కిస ఎల్లారెడ్డి,ఒగ్గు రమేష్,ఏలేటి మాధవరెడ్డి,జాప బాల్ రెడ్డి, లను ప్రమాణస్వీకారం చేయించగా ఈ సందర్భంగా ఎంఎల్ఏ కవ్వంపెల్లి సత్యనారాయణ పాలకవర్గం ను ఉదేశించి మాట్లాడుతూ సకాలంలో రుణాలు మరియు ఎరువులు విత్తనాలు రైతులకు ప్రభుత్వం చేస్తున్నటువంటి రుణమాఫీ రైతుభరోసా వంట పథకాలు సకాలంలో అందేలా చూడవలసిన బాధ్యత నూతన పాలకవర్గం పై ఉంటుందని అని తెలియజేసారు ఈకార్యక్రమంలో అన్ని గ్రామాల సర్పంచ్ లు జిల్లా మరియు మండల నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాలుగోన్నారు.

## విధుల్లో చేరిన ప్రభుత్వ జనరల్ సర్జన్ డాక్టర్ నికీల్ తేజ..

- మంత్రి శ్రీధర్ బాబు చొరవతో మంథని ఆసుపత్రికి మరో సర్జన్

**మంథని, ఆగస్టు-14 (ప్రజాతీర్పు)**



మంథని ఏరియా ఆసుపత్రిలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ ద్వారా చేపట్టిన నూతన నియామకాలలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మరియు శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో ప్రభుత్వ జనరల్ సర్జన్ డాక్టర్ నికిల్ తేజ శుక్రవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టీవీ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. మంథని పట్టణంతో పాటు పరిసర మండలాల ప్రజలకు శస్త్రచికిత్స వైద్య సేవలను మరింత మెరుగ్గా అందించేందుకు జనరల్ సర్జన్ నియామకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మంథని ఏరియా ఆసుపత్రిలో అపెండిసైటిస్, పిత్తాశయంలో రాళ్లు, పిత్తాశయం వాపు, ఇంగ్వైనల్ హెర్నియా, బొడ్డు హెర్నియా, ఇన్సిషనల్ హెర్నియా, పైల్స్, ఫిషర్, ఫిస్టులా, మలద్వారం చుట్టూ చీము గడ్డలు, పైలోనైడల్ సైనస్, హైడ్రోసీల్, రొమ్ములో గడ్డలు, రొమ్ములో చీము గడ్డలు, లైపోమా, సెబేషియస్ సిస్ట్, శరీరంలో చీము గడ్డలు, డయాబెటిక్ ఫుట్ పుండ్లు, పేగుల అడ్డంకి, పేగుకు రంధ్రం పడటం, పెరిటోనైటిస్ తదితర సమస్యలకు శస్త్రచికిత్స సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అవసరమైన కేసుల్లో లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు కూడా మంథని ఏరియా ఆసుపత్రిలోనే నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా పేద ప్రజలకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వ వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో వైద్య సేవలకు సంబంధించి ఏవైనా సమస్యలు లేదా సందేహాలు ఉంటే సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని సూచించారు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 9885808589



## స్వతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు, పోలీస్ కవాతు పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ గార్లు.

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) ఆగస్టు 14**

స్వతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నూతన పోలీస్ పరేడ్ గ్రౌండ్ నందు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఈరోజు ఏర్పాటను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఐఏఎస్, జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ గార్లు అధికారులతో కలిసి పరిశీలించారు. స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో నిర్వహించే పోలీస్ కవాతు రిహార్సల్స్ ను పరిశీలించారు. వేడుకలకు వచ్చే పౌరులకు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రజలు, పౌరులు పాల్గొనవచ్చునని విజ్ఞప్తి చేశారు.

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని కలిసిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**నర్సంపేట టౌన్ ఆగస్టు 14 ప్రజా తీర్పు**

హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి వరంగల్ ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల అమలు, అర్హుల ఎంపిక, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, భూ సంబంధిత సమస్యలు, పేదలకు త్వరితగతిన గృహాల మంజూరు, రెవెన్యూ శాఖ పరిధిలోని ప్రజా సమస్యలు వంటి అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నర్సంపేట నియోజకవర్గంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కోరారు. ఈ విషయాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు..



Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020